నమ్మలేని నిజాలు

అహంసా బోధి
కైవల్యజ్ఞాన నిధి
మహావీరుడు.

కోతి చేష్టలు
పాలక విధానాలు
తిరుగుబాట్లు.

మేధకు మేత
చదువుమార్చురాత
పెట్టకు కోత.

చావుల కూత
కోళ్ల షాపులు బందు
వ్యాపారి గోస.

వైకుంఠ పాళీ
సత్యాసత్యాలకేళీ
జీవన పటం.



- రేడియమ్
సెల్: 9291527757


# నేటి నిజం

తెలుగు దినపత్రిక


website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com



శ్రీనిజాలు

లీకేజీ తో 'నీట్' టెస్ట్
మునిగిందోయ్ నీట !
విద్యార్థుల జీవితాలు
తోలుబొమ్మలాట !
మీ హయాంలోనే ఇలా
ఇదేమీ మోదీ ?
పరీక్ష మళ్లీ ఎప్పుడో
చెప్పండి తేదీ ?



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ గురువారం 14-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:216 పేజీలు:6 వెల: రూ.1/-


## సీఎం రేవంత్‌రెడ్డితో ఉబెర్ సీఈవో భేటీ.. హైదరాబాద్‌లో విస్తరణపై చర్చ



హైదరాబాద్, మే 13:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్ నివాసంలో ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి ఈరోజు (బుధవారం) సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబెర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఉబెర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతామని సీఈవో ఖోస్రోషాహి స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డికి ఉబెర్ సీఈవో తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన ఈ మొదటి సెంటర్‌లో 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని సీఈవో వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తి చూపించారు. పార్కింగ్ వ్యాపారంలోకి వచ్చే అంశాన్ని పరిశీలించాలని ఉబెర్ సీఈవోకి సూచించారు ముఖ్యమంత్రి. దేశంలోని ప్రముఖ నగరాల్లో పార్కింగ్ సమస్యను ఉబెర్ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు సీఎం. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. సీఎం సూచనపైన సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార విస్తరణకు అన్నివిధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉబెర్ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత కాల్పుల్లో చర్చి నేతలు మృతి..

న్యూ ఢిల్లీ, మే 13:జాతుల పోరుతో రగులుతున్న మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత నెలకొన్నది. వాహనాల్లో ప్రయాణిస్తున్న చర్చి నేతలపై దుండగులు కాల్పులు జరిపి హత్య చేశారు.

దీంతో జాతీయ రహదారి దిగ్బంధానికి కుకీ విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది. బుధవారం చురాచంద్‌పూర్ జిల్లాలోని లామ్కాలో జరిగిన థాడో బాప్టిస్ట్ అసోసియేషన్ (టీబీఏ) సమావేశానికి కొందరు చర్చి నేతలు హాజరయ్యారు. ఆ తర్వాత రెండు వాహనాల్లో కాంగ్‌పోక్పికు బయలుదేరారు.

కాగా, మార్గమధ్యలో గుర్తుతెలియని వ్యక్తులు వారి వాహనాలపై కాల్పులు జరిపారు. టీబీఏకు చెందిన ముగ్గురు చర్చి నేతలు ఈ కాల్పుల్లో మరణించారు. మణిపూర్ బాప్టిస్ట్ కన్వెన్షన్ (ఎంబీసీ) మాజీ ప్రధాన కార్యదర్శి రెవ. వీ సిట్లో, రెవ. వీ కైగౌలున్, పాస్టర్ పాగౌలెన్‌గా మృతులను గుర్తించారు.

మరోవైపు ఈ దాడిలో మరో ఐదుగురు గాయపడ్డారు. గాయపడిన రెవ. ఎస్.ఎం. హాపు, రెవ. హెక్రై సిమ్టే, రెవ. పావోతాంగ్, రెండు వాహనాల డ్రైవర్లు లెలెన్, గౌమాంగ్‌ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## ఐటీ కారిడార్, కూకట్ పల్లి పరిసర ప్రాంతాల్లో ప్రయాణం చేసే వారి సౌకర్యార్థం కోసం రూ.530 కోట్ల ఫ్లై ఓవర్ నిర్మాణం

హైదరాబాద్, మే 13: నిత్యం రద్దీతో సతమతమవుతున్న హైదరాబాద్ నగర వాసులకు ప్రభుత్వం ఓ భారీ గుడ్ న్యూస్ చెప్పింది. నగరంలో ఐటీ కారిడార్, కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో ప్రయాణం చేసే వారి సౌకర్యార్థం ఫ్లై ఓవర్ నిర్మించనున్నట్లు ప్రకటించింది. అల్విన్ కాలనీ నుంచి మియాపూర్ వరకు ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ప్రభుత్వం భారీ ఫ్లైఓవర్ ని నిర్మిచనుంది. అందుకుగాను ప్రభుత్వం రూ.530 కోట్ల రూపాయలతో భారీ కేటాయింపులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

### కూకట్‌పల్లిలో ట్రాఫిక్‌కు చెక్..

నగరంలో అత్యంత రద్దీగా ఉన్న ప్రాంతాల్లో కూకట్‌పల్లి, జేఎన్టీయూ, మియాపూర్ మార్గం ముందువరుసలో ఉంటాయి. అయితే రోజు ఆఫీస్ టైమ్‌లలో సిగ్నల్లు దాటాలంటే నిమిషాల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. దీంతో ప్రయాణికులు ఈ రూట్లో ప్రయాణించాలంటే చుక్కలు చూస్తున్నారు. దీనికి చెక్ పెట్టడం కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టుతో సమస్యను పరిష్కరించడానికి తెలంగాణ ప్రభుత్వం 1.8 కిలోమీటర్ల పొడవుతో ఈ భారీ ఫ్లైఓవర్‌ను రూపకల్పన చేసింది. దీని అంచనా వ్యయాన్ని 530 కోట్లకు టార్గెట్ గా పెట్టుకుంది. దీనికి పూర్తి డిజైన్ మొత్తం రెండువైపులా కలిసి 6 లైన్ల రోడ్లు 24 మీటర్ల పొడవుతో నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు భూసేకరణకు 200 కోట్లు పెట్టారు. దీంతో జేఎన్టీయు పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ తగ్గనుంది. ప్రయాణ సమయం ఇధన ఖర్చులు లక్షలాది మందికి ఉపశమనం కలగనుంది.

### జూన్ నెలలో శంకుస్థాపన బాచుపల్లి ఫ్లై ఓవర్ రెడీ

#### ఈ నెలలోనే రేవంత్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం

### జూన్ నుంచే పనులు ప్రారంభం

ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిధులు మంజూరు చేయడంతో అధికారులు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. దీనికి అన్ని అనుమతులు సకాలంలో వస్తే ప్రభుత్వం దీనిని వచ్చే నెల జూన్ నాటికి పనులు ప్రారంభించే అవకాశం ఉంది. దీంతో ప్రజలకు మరిత మేలు జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

కాగా, హెచ్ ఎండీఏ ధ్వర్యంలో నిర్మించిన బాచుపల్లి జంక్షన్ ఫ్లైఓవర్ పనులు పూర్తయ్యాయి. ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయగా.. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది. వేగంగా విస్తరిస్తున్న బాచుపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు ఇది ప్రధాన పరిష్కారంగా మారనుందని అధికారులు భావిస్తున్నారు. గత కొన్నేళ్లుగా బాచుపల్లి జంక్షన్ పరిసర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందడంతో వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో మియాపూర్, గాజులరామారం, నిజాంపేట్, బౌరంపేట్ వైపు వెళ్లే వాహనాలతో జంక్షన్ తీవ్ర రద్దీగా మారేది. కొన్నిసార్లు వాహనాలు దాదాపు అరగంట పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రజాప్రతినిధుల విజ్ఞప్తుల మేరకు మూడు సంవత్సరాల క్రితం హెచ్ఎండీఏ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించింది. సుమారు 1.3 కిలోమీటర్ల పొడవుతో ఆరు లేన్లుగా ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించారు. ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.141 కోట్లను మంజూరు చేయగా.. అందులో సుమారు రూ.71 కోట్లు ఫ్లైఓవర్ నిర్మాణానికి వినియోగించారు. మిగతా నిధులను భూసేకరణ, ఇతర అనుబంధ పనుల కోసం ఖర్చు చేశారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే మియాపూర్–గండిమైసమ్మ మార్గంలో ట్రాఫిక్ ఒత్తిడి చాలా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. అలాగే నిజాంపేట్, మల్లంపేట్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలు కూడా మరింత సులభం కానున్నాయి. కొత్తగా రూపుదిద్దుకున్న జంక్షన్‌తో బాచుపల్లి ప్రాంత ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తగ్గనున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు.. రైతులు, రైల్వేలు, పరిశ్రమలకు భారీ ఊతం



న్యూఢిల్లీ, మే 13:ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం ఈరోజు(బుధవారం) ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై కేంద్రమంత్రులతో ప్రధాని చర్చించారు. ఈ భేటీలో పలు నిర్ణయాలకు ఆమోదం లభించింది.

ఈ సమావేశంలో పశ్చిమాసియా సంక్షోభం, పెరుగుతున్న గ్లోబల్ ఆయిల్ రేట్స్, ఇంధన సంరక్షణ, వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ క్లాసెస్, బంగారం కొనుగోళ్ల వాయిదాపై చర్చించినట్లు సమాచారం. అలాగే, ఖరీఫ్ సీజన్ మద్దతు ధరల నుంచి కోల్ గ్యాసిఫికేషన్, రైల్వే ప్రాజెక్టులు, విమానాశ్రయ ఆధునికీకరణ వరకు భారీ కేటాయింపులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

### ఖరీఫ్ మద్దతు ధరలకు రూ.2.60 లక్షల కోట్లు..

దేశవ్యాప్తంగా రైతులకు మద్దతుగా ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరల (ఓూఖ) అమలుకు కేంద్ర కేబినెట్ రూ.2,60,000 కోట్ల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా రైతులకు పంటలకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు వ్యవసాయ రంగానికి ఆర్థిక భరోసా లభించనుంది.

### కోల్ గ్యాసిఫికేషన్ పథకానికి రూ.37,500 కోట్లు..

దేశంలో బొగ్గు వినియోగాన్ని ఆధునికీకరించేందుకు కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు రూ.37,500 కోట్ల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా దిగుమతి ఇంధనాలపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు దేశీయ పరిశ్రమలకు మద్దతు లభించనుంది.

### సెమీ హైస్పీడ్ రైల్వేలైన్‌కు గ్రీన్ సిగ్నల్..

గుజరాత్‌లో సర్కేజీ – ధోలేరా మధ్య సెమీ హైస్పీడ్ డబుల్ రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఈ ప్రాజెక్టుకు రూ.20,065 కోట్ల వ్యయాన్ని కేటాయించింది. రైల్వే కనెక్టివిటీ మెరుగుపడి పారిశ్రామిక అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

### నాగపూర్ అంతర్జాతీయ విమానాశ్రయ ఆధునికీకరణ..

మహారాష్ట్రలోని నాగపూర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆధునికీకరించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

కొత్త సదుపాయాలు, విస్తరణ పనులతో విమానాశ్రయ సేవలు మరింత మెరుగుపడనున్నాయి. దీని ద్వారా ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

### అభివృద్ధి, మౌలిక వసతులపై కేంద్రం ఫోకస్..

ఈ నిర్ణయాలతో వ్యవసాయం, రైల్వేలు, ఇంధన రంగం, విమానయాన రంగాలకు భారీ ప్రోత్సాహం లభించనుంది. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

## 144 ఓట్లతో బలపరీక్షలో నెగ్గిన సీఎం విజయ్



చెన్నై, మే 13: తమిళనాడు అసెంబ్లీలో ఇవాళ సీఎం విజయ్ బలపరీక్షలో నెగ్గారు. ఆయనకు అనుకూలంగా 144 మంది ఓటేశారు. 22 మంది వ్యతిరేకంగా ఓటేశారు. అయిదుగురు ఓటింగ్‌లో పాల్గొనలేదు. ఇక డీఎంకే పార్టీ సభ నుంచి వాకౌట్ చేసింది. ఆ పార్టీకి 59 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అన్నాడీఎంకే రెబల్స్ .. టీవీకేకు అనుకూలంగా ఓటేశారు. కానీ పళనిస్వామి వర్గం మాత్రం వ్యతిరేకంగా ఓటేసింది. టీవీకే పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో 108 స్థానాల్లో నెగ్గింది. విజయ్ రెండు చోట్ల నెగ్గడంతో ఓ స్థానం ఖాళీ అయ్యింది. ఇక ఒక్క ఓటుతో గెలిచిన టీవీకే ఎమ్మెల్యే.. బలపరీక్షలో పాల్గొనలేదు. అయితే విశ్వాసపరీక్ష కన్నా ముందే కాంగ్రెస్‌తో పాటు వామపక్షాలు విజయ్‌కు మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. తమిళనాడు అసెంబ్లీలో 117 మ్యాజిక్ మార్క్.

బలపరీక్షపై చర్చ తర్వాత తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ మాట్లాడారు. తమ సర్కారు సెక్యూలర్ విధానానికి కట్టుబడి ఉందన్నారు. తమ ప్రభుత్వం వేగవంతమైన గుర్రం తరహాలో పనిచేస్తుందని, కానీ హార్స్ ట్రేడింగ్‌కు పాల్పడదని చెప్పారు. గత ప్రభుత్వాలకు చెందిన అన్ని సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అన్ని పార్టీలకు చెందిన సభ్యులు విశ్వాస పరీక్ష చర్చలో పాల్గొన్న తర్వాత విజయ్ మాట్లాడారు. ఓటింగ్‌కు ముందు సభా డోర్లను మూసివేయాలని స్పీకర్ జేసీడీ ప్రభాకర్ ఆదేశించారు. ఎమ్మెల్యేలు ఎవరి సీట్లలో వారే కూర్చున్నారు. బ్లాక్ వారిగా ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు.

## హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం.. ఇద్దరి మృతి

హైదరాబాద్, మే 13: నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈరోజు(బుధవారం) మల్లాపూర్ స్వాగత్ కన్వెన్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఓ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతులు మౌలాలికి చెందిన గణేశ్, గంగాధర్‌గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ ప్రతిరోజు కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు.

ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి అతివేగమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నాచారం పోలీస్ స్టేషన్ వద్ద మృతుల బంధువులు ఆందోళనకు దిగారు.

## బండి భగీరథ్‌ను తప్పించే అవసరం మాకు లేదు: మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్, మే 13: పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని.. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తప్పకుండా అరెస్ట్ చేస్తారని తెలిపారు. బండి సంజయ్ కొడుకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిఖార్సైన కాంగ్రెస్ లీడర్ అని చెప్పుకొచ్చారు. బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం లేదని వెల్లడించారు. పోక్సో చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బండి భగీరథ్‌ను తప్పించే అవసరం తమకు లేదన్నారు. భగీరథ్ విదేశాలకు వెళ్లారని అనుకోవడం లేదని అన్నారు.

మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని పీసీసీ చీఫ్ అన్నారు. ప్రధాని మోదీ ఏదో ఇస్తారని అనుకుంటే ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయన్నారు. బండి భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వెనుకంజ వేయదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విజయలక్ష్మికి మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. ఎవరికి వారు తెలంగాణ జాతిపిత అనుకుంటే ఎలా.. జాతిపిత అనే బిరుదు ప్రజలు ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి ఉన్నారని.. కవిత, కేటీఆర్ తర్వాత వచ్చారని తెలిపారు. తెలంగాణలోనూ ఎవరితో అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఎవరి ఓటును వాళ్లు కాపాడుకోవాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమై వ్యక్తిగత జీవితానికి అలవాటు పడ్డారన్నారు. రాష్ట్రంలో గతం కంటే ఈసారి ఎక్కువగా పంట దిగుబడి వచ్చిందని మహేశ్ అన్నారు.

## మొక్క జొన్న కొనుగోలు ఆలస్యం జరిగితే కఠిన చర్యలు

### -రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

ఆదిలాబాద్, ఏప్రిల్ 22: నారాయణ పేట జిల్లా మక్తల్ నియోజకవర్గం నర్వ మండలం లో మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర క్రీడా,పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద జరుగుతున్న తీరును మంత్రి పరిశీలించారు. గన్ని బ్యాగుల కొరత మంత్రి దృష్టికి తేగా వెంటనే మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ శ్రీలత కి ఫోన్ చేసి గన్ని బ్యాగుల కొరత లేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. మొక్క జొన్న కొనుగోలు ఆలస్యం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటానని మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను హెచ్చరించారు.

### చురక

నీట్ పరీక్ష పేపర్
నగ్నంగా లీకేజీ
ప్రభుత్వం ఏదైనా
ప్రతీ ఒక్కటి టేకీజీ
విద్యార్థుల భవిష్యత్తు
విలపించే గుండె ఘోష
తీర్చలేని దర్యాప్తుల
తీరు వట్టి కంటి శోష



-వేల్పుల నారాయణ
9440433475

### రాధశ్రీ రాగాలు

క్షణము జిందాబాదు
క్షణము ముర్దాబాదు
నేటి బ్రతుకే చేదు
అనును రాధశ్రీ !!
అడ్డ దారులు త్రొక్కి
ఫక్తు సినిమా ఫక్కి
దొంగ దోచును నక్కి
అనును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210

## తెలంగాణ ప్రజలను భయాందోళనలకు గురి చేసిన స్కై లాబ్

స్కై లాబ్... ఈ పేరు నేటి తరానికి అంతగా తెలియక పోవచ్చు. దాదాపు అర్థ శతాబ్ది క్రితం జనజీవనాన్ని అతలాకుతలం చేసిన సంఘటన. ప్రధానంగా తెలంగాణ అదీ ఉత్తర తెలంగాణ ప్రజలను తీవ్ర భయ భ్రాంతులకు గురిచేసిన నేపథ్యం. యాభై ఏళ్ల పైబడిన వారిని కదిలిస్తే ఈనాటికీ వెంటనే గుర్తుకు వచ్చి, ఆనాటి తీవ్ర భయాందోళనల పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు వివరించే అరుదైన సంఘటనల అపురూప అపూర్వ దృశ్యం.

అంతరిక్షం లో మానవులచే నిర్మించిన పరిశోధనా ఉపగ్రహం లాంటి పరికరాల నిర్మిత అతిపెద్ద కేంద్రాన్ని స్కైలాబ్ అంటారు. భూమి గురుత్వాకర్షణ శక్తిని ఛేదించి మొదటి కృత్రిమ ఉపగ్రహం స్పుత్నిక్-1ని 1957–అక్టోబర్‌లో అప్పటి సోవియట్ యూనియన్ పంపించడంతో అంతరిక్ష పరిశోధనలు వేగం పుంజుకున్నాయి. ఆ తర్వాత అంతరిక్షం లోనే మానవుడు పరిశోధనా కేంద్రాన్ని (స్కైలాబ్) స్థాపించి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం, దానిలోనే ఉంటూ పరిశోధనలు చేస్తూ సౌరకుటుంబాన్ని గురించి ఎన్నో కొత్త విషయాలను తెలుసు కోవడానికి ఈ విజ్ఞానం ఉపయోగించు కున్నాడు. ఈ కేంద్రాన్ని అమెరికా, రష్యా, ఇతర అభివృద్ధి చెందిన దేశాలు అంతరిక్షంలో పరిశోధనలు చేయడానికి నిర్మించాయి. ఈ అంతరిక్ష కేంద్రం భూమి పరిభ్రమించే లోపలి కక్ష్యతో నిర్మించబడింది. ఈ అంతరిక్ష కేంద్రం భూమికి 278 నుండి 460 కి. మీ. ఎత్తులో ఉండి, సరాసరి గంటకు 27, 743 కి. మీ. వేగంతో పరిభ్రమిస్తూ ఉండేది. ఇది రోజుకు 16 సార్లు భూమి చుట్టూ ప్రదక్షిణలు చేసేది. ఈ కేంద్రంలో వ్యోమగాములు ఉంటూ, భూగోళ వాతావరణ అధ్యయనానికి, సమాచార ప్రసార సాధనంగా స్కై లాబ్ ను వినియోగించు కున్నారు.

స్కైలాబ్ మొదటి యునైటెడ్ స్టేట్స్ అంతరిక్ష కేంద్రం, నాసా ప్రారంభించింది. మే 14 1973, ఫిబ్రవరి 1974 మధ్య 24 వారాలపాటు క్రియాశీలంగా ఉంది. ఇది అంతరిక్ష పరిశోధక నౌక. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా దీన్ని రూపొందించింది. కక్ష్యలోకి ప్రవేశపెట్టిన దీని జీవిత కాలం ఏడేళ్లు. అయితే అంతరిక్షం లోకి పంపిన తర్వాత దీన్ని భూమి మీదకు తిరిగి సురక్షితంగా ఎలా తీసుకు రావాలన్న విషయంలో నాసా



సరిగా వ్యవహరించలేదు. అయితే ల్యాబ్ గతి తప్పడం మొదలైంది. ఉపగ్రహ జీవిత కాలం ప్రణాళిక ప్రకారం 1974 లో స్కైల్యాబ్ జీవిత కాలం ముగిసిన తరువాత 8 –10 ఏళ్ళ వరకు కక్ష్యలోనే ఉండాల్సి ఉండగా, సౌర కార్యకలాపాలు ఎక్కువ కావడంతో ఉచ్ఛస్థాయిల్లో వాతావరణం పలుచబడి జీవిత కాలం సమయానికంటే ముందే స్కైల్యాబ్ భూవాతావరణంలోకి ప్రవేశించింది.

1978 చివరలో స్కైలాబ్ నియంత్రణ కోల్పోయి గతి తప్పడం గుర్తించారు. చివరకు అది వేగంగా వచ్చి భూమిని ఢీకొనడం తప్ప వేరే మార్గం లేదని అంతా భావించారు. అదే విషయాన్ని నాటి ప్రధాన ప్రసార మాధ్యమం అయిన రేడియోల ద్వారా పదే పదే ప్రకటింపచేశారు. ఫలితంగా ప్రజలు విపరీత భయాందోళనలకు గురయ్యారు. ఇంకా భారత భూభాగంలోనే ఢీ కొంటుందన్న ప్రచారం ఊపందుకుంది. అదే సమయంలో తెలంగాణ ప్రాంతంలో... నిజామాబాద్ ఎక్కడైనా పడే అవకాశం ఉందంటూ పత్రికల్లో వెలువడ్డ వార్తలు మరింత ఆందోళనకు దారి తీసింది. నాడు ఊరూరికీ పత్రికలు రాకున్నా, ఈ వార్తలు దావనంలా వ్యాపిం చాయి. నాటి ప్రధాన ప్రసార సాధనమైన రేడియో ఉన్న ఇళ్ళ వద్ద జనం గుమి కూడడం, భయాందోళనలకు లోనవడం సర్వ సాధారణంగా మారింది.

తెలంగాణ మొత్తం స్కైలాబ్ బారిన పడుతుందన్న శరవేగ ప్రచారం చదువుకున్న, చదువులేని వారు అన్న తేడా లేకుండా తీవ్ర ఆందోళనలో ముంచెత్తి వేసింది. 1979లో జరిగిన ఈ సంఘటన మూడు వారాల పాటు ప్రతి ఆవాస ప్రాంతంలో ఆబాల గోపాలాన్ని కంటికి కునుకు లేకుండా చేసింది.

స్కైలాబ్ వలన భూమికి భారీ నష్టం కలుగుతుందని శాస్త్రవేత్తలు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. భూమి పై పడితే మహా ప్రళయం సంభవించినట్టేనని భావించిన అనేక మంది ప్రజలు చాలామంది తమ జీవితాలకు అవే చివరి రోజులని భావించి ప్రాణాలను అరి చేతుల్లో పెట్టుకుని కాలం వెళ్ళ దీశారు. ఆకాశం నుంచి నక్షత్రం లాంటిది భూమిని ఢీకొనబోతోందని, దీంతో ప్రళయం వస్తుందని, మనుషులంతా చనిపో తారన్న ప్రచారం నానాటికీ అధికం అయింది.

అయితే అంతరిక్షంలో 24 వారాల పాటు పనిచేసిన తరువాత, కక్ష్య క్షీణించి భూవాతావరణంలోకి ప్రవేశించి స్కై లాబ్ విచ్ఛిన్నమై పోయింది. అంతరిక్ష ముగ్గురు వ్యోమగాముల బృందం స్కైల్యాబ్ భూమిపై పడి నాశనమయ్యే లోపు తమకున్న పరిజ్ఞానంతో 1974 ఫిబ్రవరి 8 న భూమికి తిగి వచ్చేశారు. 1979 జూలై 11 న స్కైల్యాబ్ భూవాతావరణం లోకి ప్రవేశించి విచ్ఛిన్నమై పోయింది. స్కైలాబ్ కక్ష్య క్షీణించి, జూలై 11, 1979 న హిందూ మహా సముద్రం మీదుగా వాతావరణంలో కాలిపో యింది. దాని శకలాలు హిందూ మహా సముద్రం లోను, పశ్చిమా ఆస్ట్రేలియా లోనూ పడ్డాయి.

ఇదిలా ఉంటే స్కై లాబ్ భూమిని ఢీకొని భారీ ప్రాణ, ఆస్తి తదితర నష్టం కలిగించగలదనే ఉధృత ప్రచార నేపథ్యంలో...నాటి అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి. మర్రి చెన్నారెడ్డి... 1979 జూలై 11న ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన ధర్మపురిలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం లో స్థానికుల సమక్షంలో, వేద పండితులతో కూడి భగవదారాధన లో గడపడం, ఆ తర్వాత హైదరాబాద్ కు తిరిగి వెళ్ళడం విశేషం..

(14 మే 1973...స్కై లాబ్ స్కైలాబ్ ప్రారంభించిన దినం.)




-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

నేటి నిజం సాహితీ కెరటాలు

website: www.netinijam.com


2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 14-5-2026



పుస్తక సమీక్ష

# తెలంగాణ నుడికారపు "మొలాటు"

**అసామాన్య పనితనం కలిగిన సామాన్యుల జీవితాలే అతని కవితా ఇతివృత్తాలు. అభూత కల్పనలు, అసంబద్ధ వర్ణనలకు తావులేనివే అతని రచనలు. ఊత పదాల ఉబలాటం, వ్యర్థపదాల ప్రయోగం లేని జీవద్భాషలో జీవం పోసుకున్న అక్షర చిత్రాలే అతని అల్లికలు. పల్లీయుల కమ్మని పలుకుబడులే అతని కైతల సొబగులు. జానుడి సొగసులే అతని సృజనకు జీవనాడి. అచ్చమైన తెలుగు భాషలో అల్కగా అభివ్యక్తీకరించడమే అతని రచనా శైలి. సాహితీ రంగంలో అడుగిడింది మొదలు, గత మూడు దశాబ్దాలుగా ప్రజల పక్షమే నిలుస్తున్న దేశీకవి కూకట్ల.**





తెలుగు సాహితీ రంగంలో అవిరామంగా కృషి చేస్తున్న అభ్యుదయ కవి కూకట్ల తిరుపతి కరీంనగర్ జిల్లా, మానకొండూరు మండలం, మద్దికుంటలో జూన్5,1975న జన్మించారు. తల్లిదండ్రులు అంకమ్మ - కనకయ్య నిరుపేద నిరక్షరాస్య కుటుంబీకులు. కూకట్ల తిరుపతి కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. తెలుగు సాహిత్యంలో పట్టా పొందారు. హనుమకొండ ప్రభుత్వ ఉపాధ్యాయ విద్యా శిక్షణా కళాశాలలో తెలుగు పండిత ప్రశిక్షణను పూర్తి చేశారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మూలసాల, మండలం మరియు జిల్లా పెద్దపల్లిలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు భాషోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పిల్లలకు మాతృభాష మాధుర్యాన్ని చవిచూపిస్తూ, రచనా మేలకువల్ని నేర్పిస్తున్నారు. విద్యార్థులతో కూడా రచనలు చేయిస్తూ, పుస్తకాలను అచ్చు వేస్తున్నారు. రేపటి సాహితీ తరం రూపకల్పనలో తలమున్కలై ఉన్నారు. సాటి ఉపాధ్యాయులకు తెలుగు భాషా విషయ నిపుణుడిగా డిఆర్పి (డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్)గా సేవలందిస్తున్నారు.

ఉపాధ్యాయునిగా, సామాజికోద్యమకారునిగా, హేతువాదిగా, రచయితగా, కవిగా కూకట్ల తిరుపతి నిరంతర అధ్యయనశీలి. భేషజాలు లేని సాహిత్య విమర్శకులు కూడానూ. ఇప్పటికీ ఈయన వచన కవిత్వం, వ్యాసం, పద్యం, గేయం, పాట, నానీలు, కథ మొదలగు ప్రక్రియలలో విరివిగా రచనలు చేశారు. ఎన్నీల ముచ్చట్లు కవిత్వ సంకలనాలు, ఎన్నీల ముచ్చట్లు ఐదేళ్ల పండుగ, సాహితీ సోపతి పదేండ్ల పండుగ ప్రత్యేక సంచికలు, పలువురు మహనీయుల షష్టిపూర్తి ఉద్యోగ విరమణ అభినందన సంచికలు తదితర పుస్తకాలకు సంపాదకులుగా వ్యవహరించారు. రంగస్థల జానపద కళాకారుడిగా పేరుగాంచారు. వివిధ సాహితీ సంస్థలలో క్రియాశీలకంగా కొనసాగుతున్నారు. సామాజిక స్పృహతో బాధ్యతతో కూకట్ల తిరుపతి రాసిన కవిత్వం 2000 సంవత్సరంలో తొలిసారిగా పత్రికలో అచ్చయింది. ఆయన కలం నుండి ఇప్పటి వరకు **'మేలుకొలుపు' వచన కవిత్వం-2005, 'చదువులమ్మ' శతకం-2006, 'పల్లె'నానీలు-2007, 'ఎర్రగాలు' కవిత్వం-2014, 'ఆరుద్ర పురుగు' కవిత్వం-2015, 'తెలుగుబడి' బాలవాచకం-2021, 'జల్లెడ' ఎన్నీల ముచ్చట్లు సమీక్షా వ్యాసాలు-2022, 'మొలాటు' కవిత్వం-2025** మొదలగు పుస్తకాలు వెలువడినాయి. అవి బహుళ పాఠకాదరణ పొందినాయి. పలువురు సాహిత్య విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. పలు విశిష్టమైన పురస్కారాలనూ తెచ్చిపెట్టాయి.

సామాజిక సమకాలీన అంశాలపై ప్రౌఢ సాహిత్యాన్ని, భావిభారత పౌరులను తయారు చేయడానికి బాల సాహిత్యాన్ని విస్తృతంగా రాస్తున్న సాహిత్య సవ్యసాచి కూకట్ల తిరుపతి. ఈయన రచనలలో సామాజిక న్యాయం కోసం తపన, మానవత్వాన్ని పెంపొందించాలనే తండ్లాట, వామపక్ష భావజాలంతో కూడిన శాస్త్రీయ దృక్పథం, అస్తిత్వవాదం కనిపిస్తాయి. ఈ కవి పసితనం నుండి జీవితంలో అనుభవించిన వివక్ష, నడిచి వచ్చిన అణచివేతల తొవ్వ ఈయనను ధిక్కారకవిగా తీర్చిదిద్దాయి. తెలంగాణ కవులలో కూకట్ల తిరుపతి పల్లెకవిగా ఒక ప్రత్యేక గుర్తింపును పొందారు. ఇతని రచనల్లో తెలంగాణ పదజాలం పరవళ్ళు తొక్కుతుంది. తెలంగాణ నుడికారం, పలుకుబడులు, జాతీయాలు, సామెతలు పుష్కలంగా జీవం పోసుకుంటాయి. కూకట్ల సహజమైన రచనా విధానమే, ఆయన భాషాపటిమను, భావనా బలాన్ని తెలుపుతుంది.

మండేపోసిన వడ్ల మొలకలు అవుతాయి, ఆ మొలకలను బురద మడిలో చల్లడాన్ని అలుకుడు చేయడం అంటారు. అలా మడిలో అలికిన మొలకను **మొలాటు** అందురు. ఆ మొలకలు ఏనుకొని, పచ్చటి నారుగా ఎదుగుతుంది. అలా ఎదిగిన నారును పీకి పొలంలో నాటు పెడతారు. ఈ కవిత్వ సంపుటి పేరును మొలాటుగా పెట్టడం ఆలోచనాత్మకంగా, ఆసక్తికరంగా ఉంది. మొలాటు శీర్షకతో ఉన్న కవితను పరిశీలించినట్లయితే, మనిషి జీవితం, మనిషిలోని మనిషితనం బురద నుండి ఎదిగి వచ్చిన మొలాటులాగా ఇగురు పెట్టాలని తెలియజేస్తుంది. **'మనిషిలో బీడువారిన ఆశలకు తరిజూసి తడిసూపు కోవాలె, అమూల్యమైన జీవితంపై మస్కచూపులు చూడడం మానుకోవాలనే'** సందేశం ఉంటుంది. నిరుపేద బతుకుల ను అందంగా తీర్చిదిద్దుకోవాలనే మేలు కొలుపు కనబడుతుంది. సామాన్య ప్రజలను తరతరాలుగా పట్టిపీడిస్తున్న ఎతలను దూప తీర్చుకున్నంత సులువుగా వాటిని తీర్చుకోవాలే సందేశం ఇస్తుంది. చేతికి పని దొరకక కష్టంగా కడతేరుతున్న జీవితాలు, హాయిగా పాడుకునే పాటలాగా సుఖమయంగా గడిచిపోవాలనే ఆకాంక్షను వెలిబుచ్చాడు కవి కూకట్ల. ఇప్పటికైనా శ్రమజీవులు సోయికి వచ్చి తరతరాలుగా వస్తున్న ఎతలను తన్ని తరిమికొట్టాలే పిలుపూ ఉంది. పిట్ట గూడులాగా ప్రతిమనిషి తన గూడునీడను సుకుమారంగా, సునాయాసంగా నిర్మించుకోవాలనే సోయి ఉంది.

కూకట్ల తిరుపతి కవిగా ఎప్పుడూ ప్రజాపక్ష పాత్రనే పోషించాడు. సామాజిక బాధ్యత గల కవిగా వర్తమానంలో జరుగుతున్న సంఘటనల పట్ల కవిత్వ రూపంలో స్పందించాడు. ప్రపంచీకరణ మూలంగా పల్లెలు ఏ విధంగా దోచుకోబడ్డాయో, పల్లె భూములను బహుళ జాతి కంపెనీలు ఆక్రమిస్తున్న తీరును వ్యతిరేకించాడు. పారిశ్రామికీకరణ పేరుతో వ్యవసాయ క్షేత్రాలు ప్రత్యేక ఆర్థిక మండళ్లుగా మారడాన్ని నిరసించాడు. నేల బొగ్గు, బండరాయి, ముడి ఇనుము తదితర ఖనిజాల వెలికితీత నెపంతో జరుగుతున్న ప్రకృతి పర్యావరణ విధ్వంసం పట్ల విపత్కర పరిస్థితుల గురించి కవిగా ఆక్రోశాన్ని **"బువ్వ చెట్టు"** కవితలో ఆర్ద్రంగా తెలియజేశాడు.

**"ప్రపంచీకరణ ప్రయోగశాలగా**
**పల్లెల బత్కు ముల్లెలు గంపగుత్తగ**
**కుదువబడ్డ దోప్కపు జాడల**
**బొండిగలకు చెయ్యి సొర్రగొట్టి**
**బోరిగెనంత కలెవెట్టిన కనరు**
**బొంత పేగుల మనసు కత్తిరించి**
**గుట్ట గుడ్డలు ఊడగొట్టుకుంట**
**మెత్తగా మెలేసిన పెట్టువడుల నెనరు**
**కాళ్ల కింది జాగ సుతా**
**కండ్ల ముంగట కదిలిపోతున్న గావర-**
**ఎవ్వరిదీ పాపం?**
**ఇంకెన్నాళ్లీ శాపం?"** అని ప్రశ్నిస్తాడు కవి. దోపిడీని నిరసిస్తాడు. ప్రతినిత్యం ఎడతెరిపి లేకుండా ప్రకృతి ధ్వంసం అవుతున్నది. పర్యావరణం పాడవుతున్నది. దీంతో ప్రకృతి కలుషిత కాసారంగా పరిణమించింది. ఈ విధ్వంసపు వికృత చేష్టలు ఇలానే కొనసాగితే, భూమిపైన భవిష్యత్తులో జీవరాసులు బతకజాలవని హెచ్చరిస్తాడు. ప్రకృతి పర్యావరణ ప్రేమికులు మేల్కోవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పుతాడు.

తెలంగాణ ఉద్యమాన్ని ప్రభావితం చేసిన అంశాలలో భాష ఒకటి. తెలంగాణ భాషలో తెలంగాణీయులు మాట్లాడుకోవాలి. రాసుకోవాలి. చదువుకోవాలనే నినాదంతో ప్రత్యేక ఉద్యమం సాగింది. ఆ అస్తిత్వ పోరాటం ఎన్నో బలిదానాల వల్ల సఫలీకృతమైంది. తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణ భాషలో కవిత్వం రాయాలని అనుకున్నప్పటికీ, పరాయీకరణ చెందిన భాష వల్ల అది అందరికీ సాధ్యం కాలేదు. గ్రామీణ జీవితం ఉన్న కూకట్ల తిరుపతి విద్యావంతుడు కావడం వల్ల ఇందులోని కవితలన్నింటిని తెలంగాణ భాషలో రాసి, ఆ భాష ఇంకా పది కాలాలపాటు నిలబడేటట్టు చేశాడు. తను కవిత్వీకరించిన ప్రతి వస్తువుకు పరాయికరణ చెందిన మిశ్రమ భాషను వాడకుండా జానపదుల జీవభాషను వాడటం అభినందనీయం. ఇతనికి ఇంటి భాష మీద ఎనలేని మమకారం ఉంది. అనుభవ పూర్వకమైన గట్టి పట్టు కూడా ఉంది. తెలంగాణ పల్లెభాషకు పట్టం కట్టిన ఈ కవితను చూడండి.

**"నేను**
**కోలాపాలె మట్టుశీలా**
**నాగటిని ఆమిరిచ్చినప్పుడల్లా**
**ఎలుగు సలుగుల లోకం ఎక్కిరిత్తనే ఉన్నది...**
**ఎగిలివారంగ కండ్లు నలుసుకుంట**
**ఏగిర్తమేగిర్తమే ఎవుసప్పనికి బైలెల్లంగ**
**ఎగుడు దిగుడుల కలియుగవే కండ్లల్లమెరుస్తున్నది...**
**ఎర్ర శెల్కలను కుంకుమ పొడిగొట్టిన రీతి**
**నల్లరేగల్లలు నశంనశం జేసిన రివాజు**
**ఖుష్కీతో కుస్తీనో తరీతో దోస్తీనో కాదు".**
అంటూ తెలంగాణ జన బాసతో కైతకు జీవం పోశారు. ఎగిరెగిరి పడుతున్న నిక్కుడు పుంజు వంటి మనిషి జీవితాన్ని చక్కగా ఆవిష్కరించారు. 'సాలెన్క సాలు' పేరుతో సారవంతమైన సందేశాత్మక కవితను అల్లారు.

అమ్మ గురించి కవిత్వం రాయని కవులు లేనట్టే, అన్నదాత గురించి కవిత్వం రాయని కవులు లేరంటే అతిశయోక్తి కాదేమో. 'బుగులు మొగులు' కవితలో అన్న దాతల దైన్యాన్ని, ధైర్యాన్ని, గొప్పతనాన్ని మన కళ్ళముందు ఉంచుతాడు. ఢిల్లీ పాలకులు తీసుకువచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని చేపట్టిన రైతుల ఉద్యమంలో చనిపోయిన రైతులను తలుచుకుని, వారికి సంఘీభావంగా రాసిన కవిత.

**"నీ చూపు గుణమో**
**నీ చేయి చలువనో తెల్వదు గానీ**
**నీ నీడ సోకీ సోకంగనే**
**మన్ను అన్నమయి అరుసుకుంటది**
**సబ్బండ జీవరాశిని సకులం సవరిత్తది**
**గిట్టుబాటు గొట్టెకాయైన తావుల్ల**
**కనీస మద్దతుకు దస్త్రం దస్కతుండదు**
**పుట్లకు పుట్లు పండిన దినుసు దిగులు మొగులయి**
**దుక్కపు రాగమెత్తుకుంటుంది**
**పాత పండ్ల సలపరింతల నడుమ**
**మూడు కొత్త రాచపుండ్ల మంట రాజుకుంటది**
**అన్నం బెట్టేటోనికి సున్నం బెడుతున్నరు**
**జగనన్నా**
**లడాయి రాగమెత్తుకుందామా ?**
**ఢిల్లీ పానాధులల్ల డిల్లెం కల్లెం ఆడుదాం**
**సత్తే మట్టికి ఎరువైదాం**
**బతికితే సేనుకు సత్తువైదాం".** అని ఆందోళన వ్యక్తం చేస్తాడు. అక్షరావేశంతో ఊగిపోతాడు. అన్నదాతలకు అక్షరాలు ఆసరా అవ్వాల్సిన ఆవశ్యకతను అక్షరీకరించాడు. ఈ కవి రైతు కుటుంబ నేపథ్యం నుంచి వచ్చినవాడు కావటం వల్లే; కవిత్వంలో కర్షకుల బతుకులను కళ్ళకు కట్టించ కలిగాడు.

మొలాటు కవితా సంపుటిలో 'బువ్వ చెట్టు, పాయిరం గల్ల యిల్లు, బూదేవర, నెత్తుటి పునాది, సర్కారు సోపాల, బొడ్డు శీల... ఇలా అన్ని కవితల్లో తెలంగాణతనం ఉట్టి పడేలా రాసిన కవి కూకట్ల తిరుపతికి అలాయి బలాయి. ఇక కవితా వస్తువు విషయానికి వస్తే; తెలంగాణ పోరాటాలు, అమరవీరుల త్యాగాల తలపోతలు, తెర్లవుతున్న తెలంగాణ సంపద, ఆర్టీసీ కార్మికుల గోస, బమగల్ల ఊరి జీవితం, బడుగుల బతుకుల్లో ఎన్నీల కాయడం, అన్నదాతల అగచాట్లు, చదువుల సాయారం, దోపిడీ నిర్మూలనం, అంకవ్వ అనురాగం, కరోనా కష్టాలు, మానవత్వంపై మమకారం, ప్రపంచీకరణ పడగనీడ, రైతుల మహా పాదయాత్ర, మతం రేపుతున్న మంటలు, సహజ వనరుల విధ్వంసం, ప్రకృతి పర్యావరణ పరిరక్షణం, ప్రజా సాహిత్యపు ఆవశ్యకత, తెలంగాణ అస్తిత్వం, దొడ్డి కొమురయ్య వీరత్వం, బెల్లి లలిత అమరతత్వం, సినారె, మచ్చ ప్రభాకర్, వొడ్నాల కిషన్ల యాదులు.... ఇలా ప్రతి కవితలో వస్తు వైవిధ్యం కనిపిస్తుంది. శిల్పం చూసినట్లయితే; సరళంగా, సుందరంగా మనసుకు హత్తుకునే జీవభాషలో రాశాడు. తెలంగాణ భాషా సొగసు, సొంపు, గడుసుతనం, పెడసుతనాల కలయిక కనబడుతుంది. తెలంగాణ భాష కమ్మదనం, అమ్మతనం, వైభవం ఎలా ఉంటుందో పాఠక హృదయాలకు చక్కగా రుచి చూపించాడు. ఈ కవితల్లో తన తల్లిభాషను, ఇంటి భాషను, పరిసర భాషను, పల్లె భాషను, వ్యవసాయ వృత్తి భాషను, జానుడిని ఎక్కడ కూడా మిస్ కానీయకపోవడం ప్రశంసనీయం. అసలు సిసలైన తెలంగాణ దేశికవి గా కూకట్ల తిరుపతి నూటికి నూరు శాతం సఫలీకృతుడైనాడని చెప్పవచ్చు. వస్తుకవిత, దేశీమార్గం, జాను తెలుగుకు జీవం పోసిన కవి నన్నెచోడుడు. అచ్చ తెలుగుకు కావ్య గౌరవాన్ని కల్పించిన సామాజికోద్యమ కవి పాల్కురికి సోమనాథుడు. అచ్చ తెలుగు కావ్య రచనకు ఆద్యుడు పొన్నెకంటి తెలగనార్యుడు. తెలంగాణ జీవనుడిని కవిత్వ నాడిగా మలచిన కవులు కాళోజీ నారాయణరావు, టి.కృష్ణమూర్తి యాదవ్, దేవరాజ్ మహారాజ్ తదితరుల బాటలో పయనిస్తూ, జీవద్భాషలో మూడు దశాబ్దాలుగా విరివిగా రచనలు వెలువరిస్తున్న దేశీకవి కూకట్ల తిరుపతి భాషా సాహిత్యాలపై లోతైన పరిశీలన, పరిశోధన జరగాల్సిన అవసరం ఎంతో ఉంది. తెలంగాణ జానుడి సొబగులను భావితరాలకు అందించడానికి, ఆ సొగసును సాహితీ రూపాల్లో భద్రపరుచుకోవాలి. అచ్చ తెలుగు భాషను అవలీలగా కవిత్వంలో పొదుగుతున్న కూకట్ల తిరుపతి సదా అభినందనీయులు. ఈయన కలం నుండి సమకాలీన సామాజిక సమస్యలు ఇతివృత్తాలుగా మరెన్నో పొత్తాలు తెలంగాణ జానుడిలో జాలువారాలని కోరుకుంటున్నాను. జానుడి తడి ఆరకుండా కవిత్వ మెదిని పారిస్తున్న కూకట్ల తిరుపతి గారి కలానికి అలయి బలయి.

ప్రతులకు-
కూకట్ల తిరుపతి
సెల్:9949247591



-దామరకుంట శంకరయ్య
9440876788

## అలికిడి

తలలోని గదులు
రాత్రికి రాత్రే
ఫర్నిచర్ మార్చుకున్నట్టున్నాయి
నిన్న కిటికీ దగ్గర నిల్చున్న ఆలోచన
ఇప్పుడు మూలలో కూర్చుంది
గోడ చల్లదనం
భుజానికి అంటించుకుని..
నిన్న వరకూ
అక్కడే ఉన్న అనుమానాలు
చెప్పా పెట్టకుండా వెళ్లిపోయాయి
వాటి చోట
చెక్కపై చిన్న గీతలు
వేలు తాకితే ఇంకా గరుకుగా ఉన్నాయి.
ఒక ఆలోచన
తన పాత చర్మం విడిచిపెట్టి
మరొక ఆకారంలో నడుస్తోంది
వదిలిన పొర
పాదం కింద ముడుచుకుని
సన్నగా చప్పుళ్లు చేస్తోంది.
పేరు పెట్టని భావాలు
టేబుల్ అంచున
వేచి ఉన్నాయి
వాటి బరువుతో
అంచు కాస్త వంగినట్టు ఉంది.
ఇప్పుడే మొదలైన రోజు
ఎవరూ వాడని భాషలా ఉంది
దానిలో మొదటి వాక్యం
నా అడుగే



-మువ్వా శ్రీనివాసరావు
సెల్: 9948099900





రైతన్నకు
ఏమని దైర్యం చెప్పాలి
ఎటూ చూసిన నీళ్ళే...
చేతితో ధాన్యం నింపుదామంటే
దోసిళ్లలో నీళ్లు తప్ప
ధాన్యం రాకపాయె!
నోటిదాక వచ్చిన కూడు
తెప్పల్ల తేలియాడే!
ఆరుగాలం కష్టపడ్డ
కష్టజీవి గుండెపగిలి
కండ్లల్లో నీళ్ళే కాదు
కళ్ళంలోనే నీరైనాడు!



-నాగం సాయిలు
9490209037

# సున్నిత పదాల్లో అద్భుత భావాలు ఆత్రేయ ప్రత్యేకత



అఖిల, టి.బాల కామేశ్వరరావులకు బిరుదు "గాన ప్రవీణ" ప్రదానం చేసిన ఆచార్య నిత్యానందరావు, సారిపల్లి కొండలరావు. ఎస్వీ రామారావు, లంక లక్ష్మీ నారాయణ, డా॥పి. జ్యోతి, పొత్తూరి సుబ్బారావు.

సున్నిత పదాలతో అద్భుత భావాలు తెలియజేయటం కవి ఆచార్య ఆత్రేయ ప్రత్యేకతని తెలుగు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. గురువారం రాత్రి రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువకళావాహిని ఆధ్వర్యంలో ఆచార్య ఆత్రేయ జయంతి సందర్భంగా ప్రముఖ గాయనీ గాయకులు అఖిల, టి. బాల కామేశ్వరరావులకు 'గాన ప్రవీణ' బిరుదు ప్రదానోత్సవం నిర్వహించారు. డా॥ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆచార్య వెలుదండ నిత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'దీక్ష'తో సినిమాలోకి వచ్చిన ఆత్రేయ సంగీత ప్రపంచానికి లాలిత్యాన్ని, మాధుర్యాన్ని అందించారని కొనియాడారు.


ఆత్రేయ పద్య, గేయ కవిత్వం, మాటలు, పాటలు రాశారని తెలిపారు. సభలో సాహితీకిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు,ప్రముఖ సినీ రచయిత డా॥. పి. రాజేంద్రకుమార్, రచయిత్రి డా॥పి. జ్యోతి, కళారత్న ఎస్.వి. రామారావు, యువకళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు బొప్పన నరసింహారావు తదితరులున్నారు.

కార్యక్రమంలో మొదట నిర్వహించిన **'నా పాట నీ నోట పలకాల చిలకా'** సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది.

# మూడు రోజుల ముచ్చట కాదిది!







- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

విదు దిగులుగా వచ్చాడు.

"నీ ముఖంలో సంతోషం కనిపించటం లేదు. ఇంట్లో ఏదన్నా సమస్యా?" అడిగింది అన్య.

"మనం ఛానల్ పెడదాం అనుకుంటున్నాం. ఇంతలో షాకింగ్ న్యూస్. 'మేంగో' కాలమ్ మామిడికాయల సీజన్‌తో ముగిసిపోతుందంట. ఇది మూడునాళ్ళ ముచ్చటే అంటున్నారు."

"ఎవరు అన్నారు?" అడిగాను.

"అయినా మీ మేంగో ఎన్ని రోజులు రాస్తాడు. రైటర్స్ బ్లాక్ వచ్చేస్తుంది. అందుకని నువ్వు ఛానల్ ఆలోచనలు మానుకో అని సలహా ఇచ్చారు. వాళ్ళు నీకు తెలియదు" అన్నాడు విదు.

అప్పుడు అన్య విరగబడి నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావు?" అన్నాడు విదు.

"ఇప్పుడు ఈ దేశంలో ఎన్ని యూట్యూబ్ ఛానల్స్ వున్నాయో, బ్లాగులు వున్నాయో, ఆన్‌లైన్ పత్రికలు వున్నాయో తెలుసా?"

"వేలూ, లక్షలూ. అవి లెక్కకు అందవు కూడా!" విదు.

"అవన్నీ మూసేసుకుంటారా" అంది అన్య.

"ఇలా అంటున్నవారికి మైండ్ బ్లాంక్ అయిందని విదూ. మన ఎడిటర్ గారు ఒప్పుకోవాలే గాని వుదయం, సాయంకాలం కూడా ఈ కాలమ్ రాయగలను" అన్నాను. ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"కాలమ్ నా పేరుతో వున్నా దీని వెనకాల అన్య, నువ్వూ, పిల్లల సైన్యం వుంది అని ఇంతకుముందు చెప్పాను. అదలా వుంచు. ఇప్పుడు పత్రికలు, టీ.వీ. ఛానళ్ళు, కాలమ్స్ రాసేవారు, కార్టూన్లు వేసేవారు, రన్నింగ్ కామెంటరీలు వదిలేవారు దుకాణాలు సర్దుకోవాలా? అందరికీ బ్లాక్‌లు వస్తాయా?" అన్నాను.

"విదూ? బ్లడ్ క్లాట్ అయితేనే స్టెంట్‌లు వేస్తున్నారు. మూడు నాలుగు స్టెంట్‌లు వేయాలంటే ఓపెన్ హార్ట్ సర్జరీలు చేస్తున్నారు. అందుకని ఆ బ్లాక్‌లూ, ఈ బ్లాక్‌లూ అని ఆందోళన పడకు" అంది అన్య.

"ఓ కవయిత్రి రెండువేల కవితలు రాశానంటుంది. ఓ రచయిత రెండువేల కథలు రాశానంటాడు. వందల నవలలు రాశానంటాడు ఇంకో రైటర్. అక్కడిదాకా ఎందుకు? నేను బతికున్నంత కాలం ప్రవచనాలు చెప్పగలను. నా సంతానం కూడా ప్రవచనాలు చెప్పుకుని బతుకుతారు అంటాడో తత్వవేత్త. వీటన్నింటికి సోర్స్ ఏమిటి?" అన్నాను.

"నువ్వే వివరంగా చెప్పు" అన్నాడు విదు.

"బతుకు నాయనా బతుకు. మనుషులు, ప్రకృతి. ఇవి వున్నంతకాలం ఓపిక లేనివారికి బ్లాకులు వస్తాయేమో. అయినా మనం ఇంకా ఎడాలసెన్స్‌లో వున్నాం. అప్పుడే బ్లాకులు రావటానికి మనం ఫాస్ట్ ఫుడ్‌లు తినటం లేదు. అయినా ఇంకా తొలి అడుగులు వేస్తున్నాం. అప్పుడే ఇన్ని అనుమానాలా!" అన్నాను.

విదు పెదవులు విచ్చుకున్నాయి.

"ఇంకాస్త వివరంగా ప్రవచిస్తాను. సూర్యుడు కొన్ని కోట్ల సంవత్సరాలుగా తూర్పున ఉదయిస్తున్నాడు. పశ్చిమాన అస్తమిస్తున్నాడు.

ఆయనకి బోర్ కొట్టిందా. ఉదయించటం మానాడా? సెలవు తీసుకున్నాడా? ఉదయం నుండి సాయంకాలం వరకు పుట్టుక నుండి వృద్ధాప్యం వరకు అన్ని దశలను చూపిస్తున్నాడు. అలాగే సముద్రాలు కూడా అంతే కదా. అలలు ఆగుతున్నాయా?" అన్నాను.

"అంతేకాదు విదూ! అమ్మలు పిల్లల్ని కనటం ఆపారా. ఈరోజున ఏ ఛానల్‌ని కదిలించినా వేలల్లో వ్యూస్ వస్తున్నాయి. అందులోనూ మేంగో అన్నట్లు ట్రంపు తాతగారు వున్నారు. ఆయన పూటకో మాట, గంటకో విన్యాసం చేస్తుంటారు. మనదేశంలో నాయకులున్నారు. అలాంటివారి చేష్టల గురించి గంటలకు గంటలు పని దినాలు నష్టం చేసుకుని చర్చలు వింటున్నాం కదా. ఎవరికన్నా వృత్తిపరమైన బ్లాకులు వస్తున్నాయా? చూసిన సినిమాలు చూస్తున్నాం. తీసిన సినిమాలు తీస్తున్నారు. క్రికెట్టూ అంతే. అందువల్ల మనం దిగులు పడవలసిన అవసరం లేదు. యుద్ధాలు-ప్రకృతి వైపరీత్యాలు వున్నంతకాలం, మనుషులు ఎవరి కోసమో ఎదురు చూసినంతకాలం ఎవరికీ ఢోకా లేదు" అంది అన్య.

"విదూ! కొంతమంది వర్తమానంలో బతుకుతుంటారు. కొంతమందికి గతం కావాలి. మరికొందరికి భవిష్యత్తు కావాలి. అందుకే రచనలు గాని, రాజకీయాలు గాని ఈ మూడింటి చుట్టూ తిరుగుతుంటాయి. అన్య చెప్పింది నిజం. నిన్ను ఎవడో వుద్ధరించటం కాదు. నీ కోసం ఎవరో యుద్ధం చేయటం కాదు. అదేదో నువ్వు చేయాలి. చేయరు. బతకాలి. బతకాలంటే ఎన్నో విన్యాసాలు చేయాలి. భజన చేయాలి. ట్రోల్ చేయాలి. మర్డర్లు చేయాలి, చేయించాలి. అసలు ఈ భూగోళాన్ని అమ్మేయాలి. అందుకు అన్ని రకాల వారు చాలా బిజీగా వున్నారు. మనం చేయగలిగింది ఒకటే. ఇలాంటివారిని ఎక్స్‌పోజ్ చేయటం. చదివినవాడు చదువుతాడు. విన్నవాడు వింటాడు. మనకో సేయింగ్ వుంది. అది షో మస్ట్ గో ఆన్. మేంగో కాకుంటే అన్య, విదూ ఈ కాలమ్‌ని కంటిన్యూ చేస్తారు. లోకం గొడ్డు పోలేదు" అన్నాను.

"ఈరోజు టాపిక్ చాలా సీరియస్ అయింది. ఇప్పుడు మనం కాసేపు మరో ప్రపంచంలో విహరిద్దాం" అంది అన్య.

"ఎలియనేషన్ అంటే ఇదే కదా!" అన్నాడు విదూ.

"ఇదీ విషయం. ఎప్పుడూ సరదాలూ, సంబరాలు అంటే కుదరదు. మధ్య మధ్యలో కాస్త సీరియస్ విషయాలు కూడా మనందరికీ అవసరమే. ఒకటి మాత్రం వాస్తవం. ఈ జర్నీ ఆగదు. మీలో ఎవరన్నా అడగవచ్చు. మహామహులకే రైటర్స్ బ్లాక్ వస్తుంది. మీరు దానికి అతీతం అని ఎలా అనుకుంటున్నారు అని. ఇంతకుముందు అన్నాను కదా! శక్తులు అంతరించినపుడు, ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు,

ఈ ప్రపంచం ఇంతే ఇంక మారదు గాక మారదు అనుకున్నప్పుడు ఏ బ్లాకులూ దరిచేరకపోయినా మౌనంలోకి జారిపోతాం. అప్పటివరకు 'షో' కంటిన్యూ అవుతుంది!



## కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

### గోముఖ వ్యాఘ్రము

మాటలతో
మంటలు పెడుతూ
మర్యాద అటకపై
విసిరేస్తూ గిల్లుతూ
వెన్నపూస రాస్తుంటే
భరించగలమా!
అసలే భరించలేము.
మనసులో ఈర్ష్య ద్వేషాలు పెట్టుకొని పైకి నవ్వుతూ
తేనె పూసిన కత్తుల వలె ఉంటారు కొందరు.
గోముఖ వ్యాఘ్రాల లాగా
మంచివారి వలె నటిస్తూ మాయ మాటలతో మోసం చేసి
నట్టేట ముంచేవారు మరికొందరు.
నోటితో మాట్లాడుతూ నొసటితో వెక్కిరించే వారు కొందరు.
ఎదురుగా నున్న వారితో ఆత్మీయంగా మాట్లాడి పక్కకు తిరగగానే
విమర్శనాస్త్రాలు సంధించేవారు అడుగడుగునా ఉన్నారు.
మాటలతో గాయాలు చేస్తూ
మానసికంగా హింసించే ప్రబుద్ధులు మరికొందరు.
ఆత్మీయులైన కష్టాలలో ముఖం చాటేస్తే భరించడం చాలా కష్టం.
ఎదుటివారి మనసులను, మనిషిని మార్చడం చాలా కష్టం. కానీ
మన మనసును మార్చుకోవడం మన చేతుల్లో ఉంటుంది.
పచ్చటి కాపురాలను కూల్చడం ఎదుటివారి బాధలను చూసి
ఆనందించే శాడిస్టులు ఎందరో.
ఇలాంటి వారితో సమాజంలో
జాగ్రత్తగా మసలు కోవాలి.
హృదయానికి గాయాలు చేస్తూ వెన్నపూస రాస్తుంటే,
అసలే భరించలేము.
కష్టాలు కన్నీళ్లతో బాధలలో ఉన్న వారి అవసరాలతో ఆడుకుంటూ
ఆదుకున్నట్టుగా నటిస్తారు కొందరు.
స్వార్థంతో కూడుకున్న మనుషుల మధ్య
అనునిత్యం జాగ్రత్తగా మసలుకోవాలి. **-ముదిగొండ రమాదేవి**
+91 99890 38762

### చేత చరవాణి చేర్చుకైలాసం.

కళ్ళు తెరిస్తే శివం
కళ్ళు మూస్తే శవం
ప్రయాణిస్తూ ఎప్పుడూ చరవాణిని చూడకు
కళ్ళు చరవాణి వైపు పోనిస్తే మిగిలేది ధైన్యం
ఇంట్లో ఎదురుచూసే భార్య చిన్నారులు
వృద్ధ మాతా పితరులు
ముక్కుపచలారని పిల్లలకు అప్పుడప్పుడే వచ్చినటువంటి భార్యకు
వయసు మీరిన తల్లిదండ్రులకు
దుఃఖాన్ని కలిగించడం భావ్యమేనా
అలసిపోయినప్పుడు వాహనాన్ని నడపకు
వాహన చోదకుడిని పెట్టుకున్న వచ్చే నష్టమేమి
కొంత డబ్బులు ఖర్చు కానీ సుఖ ప్రయాణం చేయవచ్చు కదా
డబ్బు పోతే సంపాదించుకుంటాము ప్రాణం పోతే?
నీవు వెళ్లేదారి సరైనదిగా చూసుకో
వచ్చేవారికి వెళ్లే వారికి అవకాశం ఇవ్వు వెళ్లడానికి
దారి ఏ ఒక్కరికి సొంతం కాదు అందరిదీ
బాధ నీకు ఎట్లో ఎదుటి వాడికి అంతే అని గుర్తించు
సుఖంగా ప్రయాణించు క్షేమంగా ఇల్లు చేరుకో
చేతనైతే ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే సాయం చెయ్యి
వాహనం నడపడంలో పరులను ఇబ్బందులకు గురి చేయకు
ప్రాణం పోయడం కష్టం తీయడం ఎంతో సులభం
అది భగవంతుని పని నీ చేతిలోకి మార్చుకోకు
సాయం చేసి సాహసుడివని అనిపించుకో
సాధకపాదకాలు తెలిసిన మనీషిగా మసలుకో
ఎవర్నీ తేలుకగా అంచనా వేయక తెలిసి మసులుకో
అందరికీ ప్రాణం తీపి అని ఎప్పుడు గుర్తుంచుకో
సెల్ఫోన్ మాట్లాడుతూ సొల్లు కబుర్లు చెబుతూ
సాగనీయకు మరణం వైపు నీ జీవితం
తల్లి నవ మాసాలు మోసి ప్రసవ వేదనతో మరలా జన్మించి
నీ జన్మకు కారణమైనది అది గుర్తించు ఆనందంగా జీవించు
అందరినీ ఆనందంగా జీవింప జేయి
అందమే ఆనందం ఆనందమే జీవిత మకరందం అని గుర్తించు
హాయిగా జీవించు... **-కట్టా. శ్యామలాదేవి**
+91 78932 29318

### కనువిప్పు

అకాల వర్షం, ప్రకృతి బీభత్సం
రైతన్నల రోదన, అన్నదాత ఆవేదన
ఎవరికీ పట్టని వైనం
కన్నీరు కార్చే కర్షక నయనం
కాలం కాని కాలం, ఎండాకాల వర్షం
కరుణించని వరుణుడు
కన్నెర్ర చేసిన సూర్యుడు
జరుగుతుంది ఋతువుల మార్పు
మనిషి ఇచ్చిన ఆక్రమణ తీర్పు.
నీట మునిగే మక్కలు, వంగిపోయే వరి కంకులు
రైతన్న ఆక్రందనలు, ప్రకృతిపై చేసిన మనిషి పాపాలు
కురుస్తున్న వానలు, ప్ర కృతిని చెర పట్టిన జాడలు
కనుల ముందు రుజువులు
నేడు కురుస్తున్న చినుకులు.
రైతు మెతుకుపై చినుకు
దూరం చేసింది రైతు కు నుకు
చేతికందాల్సిన పంట
రైతు బతుకులో పెట్టింది కష్టాల మంట.
రైతు చేసిన అప్పుకు
గోరగాడు ఉప్పు పప్పుకు
పంటకు పెడుతుండు నిప్పు
వానమ్మ! ఇకనైనా పొందుము కనువిప్పు
**-చిలువేరు శ్రీనివాసులు**
+91 94412 13570

### మనసు మీద మేఘాలు

మనసు మీద మేఘాలు కమ్ముకున్న వేళ,
మాటల్లో మౌనం ముడుచుకునే క్షణం,
నవ్వుల్లో దాగిన నొప్పి నిశ్శబ్దం,
నిద్రలో కూడా నడిచే ఆలోచనల యుద్ధం?.


గుండె గడియారం గడగడలాడుతుంటే,
గుర్తుల గాలి గజిబిజిగా వీచితే,
ఒత్తిడి అనే అలలు ఉప్పొంగి,
ఓపిక తీరాన్ని తాకి చెదిరిపోతాయి?.

కానీ ఆశ అనే దీపం వెలిగిన వెంటనే,
అంధకారం చెల్లాచెదురై పారిపోతుంది,
ఒక చిన్న చిరునవ్వు మొలకెత్తగానే,
మనసు మళ్లీ పూల తోటగా మారుతుంది?

ఒత్తిడి వచ్చినా ఒదగని మనసే బలం,
ఓటమి వచ్చినా నిలబడే ధైర్యమే వెలుగు,
ప్రతి క్షణం మనసుని నమ్ముకుంటే,
జీవితం మళ్లీ సంగీతంలా మ్రోగుతుంది?
**-సంధ్య వడ్లమూడి**
+91 90636 26333



# ముదురు కోయిల మధుర కవితా గానం "ముదిర"



-డా॥బీరం సుందరరావు
6303443302

"ముదిర" కైత పొత్తాన్ని ఆమూలాగ్రం చదివి కవితల సారాన్ని చిత్తానికి ఎక్కించు కున్నాను.ఆ కవిత్వం ఓ రస ప్రవాహం. అదే వేగంతో పాదాల వెంట పరుగెత్తితే తప్ప ఈ ముదిర కవితల్లోని ఆంతర్యం అంతు బట్టదు. శైలీ విన్యాసంలోని సొబగు అర్థం కాదు.ఆ కవిత్వ ంలోని భావుకతా భివ్యక్తు లకు, పదచిత్రాలకు ఆనందించి పరవ శించి వస్తువును అద్భు తంగా కవిత్వీకరిం చిన కవయిత్రి అనుభ వాన్ని పరిమళించిన ప్రతిభను

**"ముదురు కోయిల మధుర కవితా గానం ముదిం"** అనే పేరుతో నే రాసిన సమీక్షా వ్యాసం ఇది.

**- బీరం సుందరరావు**

**...నేనో అక్షరమై**
**స్వాంతనా స్వాంతన నిదు**
**సాహిత్యమునై**
**రసజగతినేలు తన్మయినై**
**కదిలే పాదాన్నై**
**గుండె నాదాన్నై**
**మిారెరుగని కవనకాంతినై**
**హృదయ భావ సౌరభ మొల్లనై...**

అంటున్న ఓ ముదురు కోయిల మధుర కవితా గానం ముదిర. తనో అక్షరమై స్వాంత నానికి స్వాంతనను కలిగిస్తానం టున్నారు ఉదాత్త భావ సృజన నేత్రి. రాసే పాదాన్ని గుండె నాద ంగా చేసుకుని కవనకాంతిగా భాసిల్లే మొల్లనవు తానంటున్న రాజావాసిరెడ్డి మల్లీశ్వరి గారు కవితామతల్లి ప్రియపుత్రిక. అక్షరాక్షరంలో అనుభవాల పూల గుత్తుల్ని ప్రణయ తరువు కు పూయించి పాదమై పరిమళిస్తున్న కవన సౌందర్యాత్మక పుత్రిక.

ముదిర.. మల్లీశ్వరి గారి అంత రంగ మధనం. పలుకు పలుకులో ప్రణయ సోత్ర కథనం.

**ముదిర ఓ శబ్ద సంహిత.**
**ముదిర ఓ అధునాతన భావ సహిత.**
**ముదిర ఓ జీవనహిత.**

వెరసి వినూత్న మానస శైలీ అభివ్యక్తి సహిత కవిత.

సుప్రసిద్ధ కవయిత్రి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరిగారు 85 కవితలతో 178 పుటల్లో తమ స్వర్ణోత్సవ కైత పొత్తంగా మనకం దిస్తున్న ముదిర సరికొత్త పదప్ర యోగశాల. గుండెల కొండల మీదుగా దూకిన భావజల పాతం. ప్రేమ అని రెండక్షరాలతో పాఠకుల హృదయ సీమపై దుమికి అంతరంగాన్ని అనురా గమయం చేసిన అరుదైన కవితల సంపుటి ముదిర. మల్లీశ్వరిగారు విద్యాధికు రాలు. తమ బోధనతో తరగతి గదుల్ని వెలిగించి, వేలా దిమంది బాలబాలికలకు మాతృ భాష తెలుగుపట్ల మమకారాన్ని పెంచిన ఉత్తమ ఉపాధ్యా యురా లు. ఓ వైపు సంప్రదాయ సాహి త్యంపై సాధికారత మరోవైపు ఆధునిక కవిత్వంపై అవగా హనవున్న అరుదైన కవయిత్రి. రచయిత్రి. తెలుగు భాషయొక్క తీరుతెన్నుల్ని లోతుగా అధ్య యనం చేసి అందరికీ ఉపయో గపడే భాషా సాహిత్య వ్యాస, సంపుటాలు ..పదాల పరిమళాలు, ఒక్క పదం.. అర్థాలెన్నో, పదంలో పదం (నిఘంటువు) వంటి విశిష్ట రచనలను మనకు కానుకగా ఇచ్చి, తెలుగు నుడికి గుడి గోపురం కట్టిన గొప్ప రచ యిత్రి మల్లీశ్వరిగారు. పిల్లల కోసం వాచకాలు రాసినా పెద్దల కోసం వ్యాసాలు రాసినా, పత్రిక ల్లో సరికొత్త శీర్షికలకు శ్రీకారం చుట్టినా తనదైన సొంత శైలి, రచనా శిల్పాన్ని చిరునామాగా మార్చుకున్న ప్రతిభా సంపన్ను రాలు మల్లీశ్వరిగారు. తెలుగులో గజల్ పై పురుషాధిక్యత కొనసా గుతున్న రోజుల్లో సరికొత్త ఊహ లతో పరిమళించే పదప్ర యోగాలతో తానో తీయని తెలుగు గజల్ గా మారి 10 గజల్ సంపుటా లతో పాఠకుల్ని సమ్మోహన పర చిన గజల్ కవితల కైరవి మల్లీశ్వ రిగారు. ప్రచురణే కాక, గజల్ ప్రాచుర్యం కోసం వర్క్ షాపులు, కవి సమ్మేళనాలు నిర్వహించి, గజళ్ళను వేదికపై గానం చేయి ంచి గజల్ స్రష్టలను సన్మానించి ... ఛాంపియన్ ఆఫ్ గజల్, ఛాంపియన్ ఆఫ్ క్రియేటివిటి ...వంటి వరల్డ్ రికార్డును సొంతం చేసు కున్న గజలేశ్వరి మన మల్లీ శ్వరి గారు. మల్లీశ్వరి గారిని ఎన్నో సంస్థలు పుర స్కారాలతో పూజించాయి. అవార్డులతో అభిషేకించాయి. గజల్ క్వీన్‌గా సంభావించి, గౌరవించాయి,

ముదిర సంపుటిలోని కవితలు వస్తువు లోను, వర్ణనలోను అభివ్యక్తి లోను కొత్త వాకిళ్ళు తెరిచాయి. పదాలకు భావసు గంధాన్ని అద్ది, భాషకు అభివ్యక్తి తిలకం దిద్ది. వచన కవితను వర్ణాల వర్ణాలతో సుసంపన్నం చేసిన మల్లీశ్వరి గారు రంగుల హరివిల్లై రసానం దం కల్గిస్తారు. ఆమె కవి త్వం. ఆ రస ప్రవాహం. మల్లీశ్వరి గారి కవిత్వ పాదాలు మెలకు వతో కదులుతాయి. ఆశను చిగురింప చేస్తాయి. అంతరం గాలను వెలిగిస్తాయి.

ప్రేమ, ఆరాధన, అర్పణ, సమర్పణలతో మల్లీశ్వరిగారి కవి త్వం లలిత పదకవిత జీవనా నందపు కౌగిలిగా మనల్ని స్పృశి స్తుంది. గుండె పొరల్లోని అనుభ వాల్ని, అనుభూతిని అందమైన భాషలో అవలీలగా చెప్పగల నేర్పు మల్లీశ్వరి గారి సొంతం,

వారి వచనం గేయంలా లయబద్ధంగా కదులుతుంది. గేయ వచనమై పలకరిస్తుం ది. ఇదో శిల్పం.

**పగుళ్ళ నోళ్ళు తెరిచిన నేలలా**
**పక్షుల గూళ్ళు లేని చెట్టులా**
**పడవల సందడి లేని రేవులా**
**ఆమె ఎండిన పండని నేల**
**నాడామె నిదురపోని వేళ** (పుట. 19-20)

పై కవితలో మనం రోజూ చూసే చెట్టు నేల, రేవు వగైరాల ను కవయిత్రి సరికొత్త పోలికలతో కవిత్వీకరించారు. ఆశలుడిగిన ఓ అబల, ఆకాంక్షలు పండని ఓ అతివ జీవితం పగుళ్ళు వారిన నేలలా, పక్షుల గూళ్ళు లేని




చెట్టులా ఉందనడం ఉపమకు ఊహల రెక్కలు తొడగడమే. ఆమె ఎండిన పండని నేల అనడం లో ప్రేమకు నోచుకోని ఓ మగువ అంతరం గానికి అద్దం పడు తుంది.

మరో కవితలో..

**అమ్మా అంటూ కొలవ బడుతూనే**
**కనికరం లేని కఠినాత్ములచే**
**కలచివేయబడుతూనే వున్నా!** (పుట.28)

అంటారు.

మల్లీశ్వరి గారి కవితల్లో అక్ష రాలను మాత్రమే చూసే వాళ్ళకు కవయిత్రి అభివ్యక్తు ల్లోని ఆంతర్యం అర్థంకాదు. కవయిత్రి ఏ కోణం నుంచి వస్తువును ఆవిష్కరి స్తున్నారో గమ నిస్తే ఓ కొత్త ప్రపంచం కన్పిస్తుంది. అది అనురాగ పూరితమైన రంగుల ఇంద్రధ నుస్సులా పాఠకుల హృదయాలపై చెరగని ముద్ర వేస్తుంది,

**"వసంతాన్ని నేను**
**కాలం మొలకలై చిగురింప**
**విచిత్ర వర్ణల**
**వింత వర్ణాల**
**మేళవింపు నేను**
**మావి చిగురు కొమ్మల్లో**
**ఎలకోయిల కలకూజితాల్లో**
**కొత్త అర్థాల పలకరింపు పులకరింపు నేను"**
(పుట. 50)

భావాన్ని అందమైన భాషలో చెప్పడం. పద్య కవిత్వంలోనే కాదు వచన కవిత్వం లోనూ కవి ప్రతిభను ప్రకాశింప చేస్తుంది. తనను తానే వసంతంగా చిత్రిం చుకుని కాలం మొలకై, సృష్టి పత్రం మీద ఆకు పచ్చని కవిత్వం సయితం చేయడం మల్లీశ్వరి గారి ఊహలోని ఉదాత్త లక్షణం.

**"అతనెప్పుడూ అంతే!**
**ఒంటరిగా రమ్మంటే**
**వసంతాన్ని వెంట తెస్తాడు"** ? అంటుంది మహెజబీన్

ఓ కవితలో-

**"నేను చెట్టును చూస్తూ**
**యుగయుగాలుగా బ్రతగ్గలను**
**చెట్టునై వుంటే**
**ఏడాదికో వసంతమైనా దక్కేది.**
**మనిషినై అన్నీ కోల్పోయాను"** అంటారు మహాకవి శేషేంద్ర.

అదే వసంతాన్ని మల్లీశ్వరి గారు విచిత్ర వర్ణాల వింత వర్ణాల పలకరింపు తో మనల్ని పులకరిం పచేస్తారు.

వచన కవిత్వంలో వచనమే ప్రవహిస్తే అందమైన అభివ్యక్తు లతో సరికొత్త పదచిత్రా లతో పరిమళింపచేస్తే తీయని పాయ సమై నోరూరిస్తుంది.

**"కళ్ళు కన్నీటి ద్రాక్షగుత్తుల్ని రాల్చడం"** (పుట-24)

**"కాలం ఎన్ని అడుగులు వేసిందో**
**ఎన్ని ప్రశ్నల మడుగైందో..."** - అనడం
**"మౌనం విలువ, కాలం విలువ**
**తెలిపేది ఒక్క ప్రేమికు లేనేమో..."**
(పుట-59)

**"చెదరిన చినుకై**
**చీకటి కునుకై**
**కాలం కళుకై**
**తృప్తి లేని ఊర్పై-తూర్పై**
**కూర్మిలేని కూర్పై**
**మేథకందని మార్పై**
**కాలం కాలుతూనే, కాల్చు తూనే**
**రాలుతూనే, వాలుతూనే వుంది"** (పుట-69)

"ఆర్ణవం అంబరం చెట్టపట్టా లేసుకున్న వేళ ఇది''-

ఇలా పలు కవితల్లోని పాదాలు పదే పదే చదివింప చేస్తాయి. భూమికీ కాశానికీ పెళ్ళి పందిరి వేసిన మల్లీశ్వరి గారి కవితల్లో ఆప్తత, ఆత్మీయత, అను భవ సాంద్రత, రసా ర్ద్రత పాఠకుని ప్రమోద భరితుల్ని చేస్తాయి. భూమికీ ఆకాశానికీ, పెళ్ళి పందిరి వేసిన మల్లీశ్వరిగారి

అభివ్యక్తికి ఆకాశమే హద్దు అన్నట్లుగా ఓ సరికొత్త లిరికల్ స్టయిల్లో (lyrical style) భావ కవిత్వానికి మరో రూపంగా మల్లీ శ్వరిగారు మనకి దర్శనమిస్తారు.

మల్లీశ్వరి గారికి శబ్ద ప్రియ త్వం ఎక్కు వ. నిత్యం మనం మా ట్లాడుకునే మాటల్నే అందంగా, అర్థవంతంగా ప్రయోగిస్తారు. సూర్యుడు, చంద్రుడు, వెన్నెల, నిట్టూర్పు, ఓదార్పు వగైరాలు వాక్యాల మధ్య వసం తంలా విరబూస్తారు.

**"వలపు వాసంతిక వాగునై**
**నీ జతన హేమంత సీమంతికనై సాగనీ**
**విరహ గ్రీష్మాన తపనబడనీకు**
**భాష్ప వర్షాన నను తడవనివ్వు"** (వర్ణిక)
అంటారు ఓ లేఖలో...

ఋతు షట్కాన్ని జీవితానికి అన్వయించి, కాలగమనాన్ని కలంతో వండించిన కవయిత్రీ తిలకం మన మల్లీశ్వరిగారు

**"నీవు మనిషివే కాదనను-**
**ప్రవహించని నదిని**
**పరవశమీయని మదిని"** (వర్ణిక)
**..మనిషి జడపదార్థం కాదు. చైతన్యానికి చిరునామా...**

పై పాదాల్లోని అంతరార్థాన్ని గమనిస్తే మనిషిలా కవికీ ప్రవాహ గుణముండాలి. కవిత్వమై రస హృదయాలను పరవశింప చేయా లి. అది లేనపుడు ఆ కవిత్వం ..మంచి కవిత్వం రాయన పుడు కవి పేరుకే అనర్థం.

మల్లీశ్వరి గారి కవితల్లో ఎత్తుగడ నుండి ముగింపు దాక ఒకే విధమైన రంగు, నడక, పద నిర్మాణ కౌశలం కనిపిస్తాయి. చదివేకొద్దీ కొత్త లోతుల్ని చూపిం చేది, మళ్ళీ మళ్ళీ చదవాల నిపించేది ఉత్తమ కవిత్వం. పద్యానికీ లేదా వచన కవితకూ, కథకూ, వ్యాసానికీ భిన్న కోణాలు ంటాయి. ఎంతమంది చదివినా, విశ్లేషించినా మల్లీశ్వరి గారి కవి తల్లో ఏదో కొత్తదనం కన్పిస్తూనే వుంటుంది. తిక్కన, వేమన, జాషువా పద్యాల్లోలా, తిలక్, దాశరథి, శేషేంద్ర, నారాయణ రెడ్డిగార్ల వారసత్వం మల్లీశ్వరి గారి కవితల్లో కన్పిస్తుంది. కుర వడానికి సిద్ధంగా ఉన్న మేఘం లా కవి కవిత్వాన్ని వర్షించాలి. వర్షపు నీరులాగే స్వచ్ఛత, సాంద్రత వుండాలి...మల్లీశ్వరి గారి కవితల్లా. ఒక కవి రాయ డానికి 5, 10 నిమిషాలు, గంట లేదా రోజు పట్టవచ్చు. కానీ ఆ కవిత రసహృదయాన్ని తాకడానికి సమయంతో పనిలేదు. సహృద యత వుంటే చాలు.

**"తలనిండ పూదండ దాల్చిన రాణి**
**మొలక నవ్వులతోడ మురిపింపబోకే**
**(దాశరథి)"**

పూలదండలోని సువాసనలా మొలక నవ్వులలోని దరహాసంలా కవిత్వం పాఠకులతో నిత్యం కర చాలనం చేయాలి, పాత సామాన్ల గదిలో వస్తువులా కాకుండా కవిత్వం సమాజాన్ని సేదతీర్చే దిగా వుండాలి. నిత్యం జాగృతం చేయాలి. తూర్పు వాకిలి తెరవాలి. మార్పు వైపు నడపాలి....

మల్లీశ్వరి గారి కవితల్లా.


**"ఎప్పటికీ వుంటా**
**నేనో అగ్నిఛత్రమై**
**హరిత పత్రమై**
**ప్రేమ సూత్రమై**
**కవితా నేత్రమై''** అంటున్న మల్లీశ్వరిగారికి రావలసినంత గుర్తింపు రాలేదన్నది నిజం. అల్ప ప్రతిభులకు పట్టం గట్టి, పల్లకీల్లో ఊరేగించే లోకంలో మల్లీశ్వరిగారు-

**"తలకు మాసిన లోకం**
**మంచి తలపులు లేని లోకం**
**తళుకు కులుకులకే**
**లొంగిపోయే లోకం**
**ఆలోకనం లేని లోకం**
**నను గుర్తించదు**
**గౌరవించదు"** (పుట. 14)

అని తమ వేదనను వ్యక్తం చేశారు. అంతరంగాన్ని ఆవిష్క రించుకున్నారు.

రేపల్లె ప్రాంతం మైనేని వారి పాలెం నల్లరేగళ్లో మొలకెత్తిన కవిత్వం మొలక మొక్కై మానై పుష్పించింది. ఫలించింది. పరిమళించింది. పుండరీ కాక్ష రావు, సత్యవతీ దంపతుల కలల పంటయింది. విప్లవాలు, వీరం గాల జోలికి పోకుండా సిద్ధాం తాలు రాద్ధాంతాల చర్చ లేకుండా ప్రకృతి సోయగాలకు ప్రతీకగా ప్రేమ అనే రెండెకరాల పతాకగా వర్తమాన సాహితీ లోకంలో కవయిత్రులకు ఆశారేఖగా నిలిచారు. రాజావాసిరెడ్డి మల్లీ శ్వరిగారు. కవిత్వం రాయడం లోనే కాదు అందమైన పేర్లతో, ఆకర్షణీయమైన ముఖచిత్రాలతో పుస్తకాలను ప్రచురిస్తున్న మల్లీశ్వరిగారు ఓ ట్రెండ్ సెట్టర్ .తాను నడిచే దారిలో సుగంధ భరితమైన మాటల మల్లెల్ని వెదజల్లుతూ అవిశ్రాంతంగా ముందుకు సాగుతున్న నాన్ స్టాప్ రైటర్. ముగ్ధ మోహన కవితల ముదిర మల్లీశ్వరిగారితో మీరూ కవిత్వ కరచాలనం చేయండి. ఆత్మీయంగా అభిందించండి.

**ప్రతులకు**:రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి
9866583907



## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

### 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123
నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ



### అవిశ్వాస తీర్మానం..!

కంటితో చూడని దృశ్యాలు
చెవితో వినని విశేషాలు
లోకమంతా పంచుకుంటే
నమ్మకం అమ్మకపు సరుకవుతోంది..
మోముపై తారాడే నవ్వుల నిజాయితీని
మనసు పొరల్లోని నవ్వులే తేల్చాలి..
మనసును గాయపరిచే మాట
అనుబంధాలను తెంచే అబద్ధం..
ప్రేమనే కూల్చేసే అపార్థం..
ఎదిగే వ్యక్తిత్వాల ఖననం..
బంధాల వైకల్యానికి మూలాలు..
ఆ వైకల్యాల దమనం లోకి నెట్టాలంటే
మనల్ని మనం కోల్పోక తప్పదు..
ఎప్పుడూ నేనే తగ్గి నడుస్తుంటా..
ఎందుకంటే బంధాలకు విలువ ఇచ్చే మనిషిని కనుక..
తృప్తి లేని ఇటుకలతో ఆశల సౌధం నిర్మించిన
విశ్వాసం లేని హృదయం
రక్తసంబంధమైనా సరే
ప్రతి బంధం పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతుంది..
మనసు ముక్కలైనా
జీవిత పయనం సశేషం..
కాలమే దానికి సరైన సమాధానం..!
**-యర్రాబత్తిన మునీంద్ర (చైత్రశ్రీ)**
ఊరు:నెల్లూరు

### కోర్కెల చిట్టా.

మనిషి ఊహల్లో విహరిస్తాడు
స్వర్గతుల్యంగా ఉంటుందని
వాస్తవాన్ని జీర్ణించుకోలేడు
నరకప్రాయమైందని...
ఊహల్లో విహరిస్తూ తనకు
రెక్కలు వచ్చినట్లు
ఎగరాలని చూస్తాడు....
మనిషి కోర్కెల చిట్టా
చాంతాడంతా
ఆస్తిమూరెడు ఆశ బారెడు
అన్న చందం
మనసు ఆకాశంలో
బుద్ధి విమానంలో
స్వేచ్ఛాసామ్రాజ్యంలో
కోరికలకు రెక్కలొచ్చినట్లు.
ఉవ్వెత్తున పొంగే కోర్కెలకు
ఆనకట్ట వేయకపోతే
భూమిని చీల్చుకొని
విత్తనం బైటకొచ్చినట్లు
మనసు మూలనుండి
ఈప్సితాలు పుట్టుకొస్తాయి.
మదినిండా
నిజం చెప్పాలనుంటుంది
ఒకచీరకొంటే
మరోటి ఉచితమట
ఆశతో అందరూ ఎగబడ్డారు
నేనూ పరుగెట్టా
అంతా వెనకబడ్డారు
ఒంటరినైపోయా
ఆగి వారితో కలిసా.
అలుపెరుగని బాటసారిలా
ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం
నింపి
సాహసయాత్ర కు బయలుదేరి
కోర్కెల వలయంలో చిక్కిన
సగటుజీవి చిరు సాహసం
అందమైన రంగుల రెక్కల్లో
రేపటిని ఇముడ్చుకునే
సీతాకోకచిలుకగా మారాలని...!
**-పద్మ చిగురాల.**

### వ్యక్తిత్వ పతనం

ఆశంటే ఏదో సాధించాలన్న దృక్పథం
ఆశకు సాధన తోడైతేనే స్వప్న సాకారం
ఆశకు దురాశ తోడైతే అది ఆశల దాహం
తీరని కోరికల ఉధృతే ఆశల దాహం.

ఒకటి తీరితే ఇంకోటి పుట్టేదే ఆశ
ఎంతున్నా, ఇంకా కావాలన్న దురాశ
ఆగక కొనసాగే ప్రక్రియే అత్యాశ
ఊపిరి ఆగే వరకు అదే శ్వాస .

తర తరాలకు తరగని సిరిసంపదలు
పోగేసి పెట్టాలన్న కొందరి ఆశల దాహం
నింపుతున్నది కొందరి బతుకుల్లో తిమిరం
ఉన్నా, ఉన్న ఊరిలో తరగని మాన్యం.

ఆక్రమించుకోవాలని పక్కవాడి పొలం
కామాంధులకు ఎక్కడలేని ఆశల దాహం
పేదోడి పొట్ట కొట్టే వరకు, తీరని దాహం.

పదవుల కోసం పాకులాడే వ్యామోహం
సామ వేద దండోపాయాలతో కిరీటం
దక్కించుకోవాలన్న నాయకుల దాహం
చేస్తున్నది ఎంతకైనా తెగించే సాహసం.

అనాదిగా ఉన్నదే అందం కోసం పందెం
ఆకర్షణీయమైనదైనా ఇల్లాలి అందం
అందగత్తెను జూస్తే ఆగలేని ఆశల మోహం
సత్యకాలం నుండి వున్నదే ఈ వ్యవహారం.

ఓసారి మొదలైందంటే ఆశల దాహం
వ్యక్తిత్వ పతనానికి అది ఆరంభం.

**-జె వి కుమార్ చేపూరి**

### మధ్య తరగతి మిడిమేళం

మధ్య తరగతి మందహాసం
పైన పటాలం లోన లొటారం
ఆస్తులు బెత్తెడైనా
ఆశలు కోకొల్లలు
అప్పుచేసైనా పప్పుకూడుకి
అడ్డవిస్తరులు పరచుకునే
డాబుసరులు
మబ్బుల్లో నీరు చూసి
ముందే ముంత
ఒలకబోసుకోవడాలు.
ఉట్టికెగరలేరు, స్వర్గానికి
నిచ్చెనలేద్దామనే జోరు
పులిని చూసి
నక్కవాతపెట్టుకున్న చందాన
గొప్పలకోసం ఖర్చుపెట్టేసి
ఆపై సర్దుబాటు చేసుకోలేక
తిప్పలు పడటాలు .
ఆస్తి మూరెడు ఆశలు బారెడైతే
గొప్పల కోసం చేసే అప్పులు
తీర్చుకోలేక చివరకు
చిప్పకూడు తినే గతిని
తెచ్చుకోవద్దు.
ఆశలు అదుపు చేసుకుని
ఆస్తులు పొదుపు చేసుకుంటే
సంఘంలో
గౌరవం నిలబడుతుంది
జీవితం సాఫీగా సాగుతుంది.
**-కొలచన విజయ భారతి**
హైదరాబాద్

# ‘సాధారణంగా కనిపించే అసాధారణ కవిత్వం’



– ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
సెల్:9989628049

**‘కవిత్వానికి, కన్నీటికి
ఎప్పటి బంధమో ఏమో
కన్నీరు కార్చిన ప్రతిసారి
కవిత్వం జాలువారుతుంది’**

ఇవి సాదాసీదా పదాలు కాదుబీ జీవితాన్ని కాచి వడబోసిన కవితా పంక్తులు. కవిత్వం ఎలా పుడుతుందనేది ఆదికావ్యం ఆవిర్భావం నుండి నేటి వరకు చర్చోపచర్చలు జరుగుతూనే ఉన్నాయి. ప్రతీ కవీ తన కవిత్వానికి ప్రేరణ ఏమిటో ప్రత్యక్షంగానో పరోక్షంగానో చెప్పుకుంటాడు. దానితో పాటు తన కవిత్వ ప్రయోజనాన్ని కూడా సూచిస్తాడు. డాక్టర్ గిన్నారపు ఆదినారాయణ కూడా అదే పని చేశాడు. కవి భావోద్వేగాలు, అనుభవాలు, కన్నీటి రూపంలో ప్రవహించినప్పుడు, అవి కవిత్వంగా మలచబడతాయని చెబుతున్నాడు. అంతేకాదు, కవిత్వం పాండిత్యానికి మాత్రమే పరిమితం కాదని, అది కవి ఆత్మను ప్రతిబింబించే భావోద్వేగంగా భావిస్తాడు. కవిత్వం కవి హృదయం నుంచి సమాజాన్ని తాకే ఒక శక్తివంతమైన ప్రక్రియగా అవతరిస్తుందని, అదే తన కవిత్వమని కూడా చెప్పకనే చెప్పాడుకవి. కవి తన భావోద్వేగాలను అక్షరాలుగా మారుస్తాడు గాయకుడైతే ఒక తన సంతోషాన్నిగానీ, దుఃఖాన్ని గాని గేయంగా మారుస్తాడుబీ చిత్రకారుడు అయితే ఒక చిత్రమవుతాడు. కళాకారుడు తన బాధనయినా, సంతోషాన్ని అయినా సత్వరమే ఏదో ఒక రూపంలో బహిర్గత పరుస్తాడు. తొలి దశలో అలా జరిగినా, ఒక సమాధ్యవస్థ పొందిన సృజనకారుడు దాన్ని సాధారణీకరించగలగాలి. అప్పుడు పాఠకుడు / ప్రేక్షకుడు దానితో తన్మయీ భావానికి గురికా గలుగుతాడు. ఒక జీవితం కవిత్వం లేదా కళ అయ్యే వివిధ దశలను ఇది తెలుపుతుంది. కవిత్వం రాయడం, దాన్ని ఆస్వాదించడంలో ఉన్న తృప్తి, ఆనందం, ఆ మమేకత సృజనకారుడు మాత్రమే గుర్తించగలడు. తాను కవిత్వం కోసం ఎలా ఉద్వేగానికి గురయ్యే వాడో, ఆ కవిత్వంలో సామాన్యుడికి స్థానం కోసం, సామాన్యుడే కవిత్వం కావడం కోసం శ్రీశ్రీ తన ‘కవితా! ఓ కవితా!’లో తెలిపాడు. అలాగే ఈ కవి కూడా తాను కవిత్వమయ్యే క్రమంలో గుండె గొంతు కలో కొట్లాడిన విధానాన్ని కవిత్వీకరించాడు.

**‘నీకై
నా మదిని నీలాకాశపు ఎడారిలో
ఒంటరి ఒంటెలా తిప్పుతున్న క్షణాలు చూస్తే
ఒయాసిస్సులు కూడా కన్నీటి బొట్లను ఆపేసుకుంటాయేమో.”**

ఇది ఆదినారాయణ వ్యక్తిగత జీవితానికి సంబంధించిందే కాదు తరతరాలుగా భారతదేశంలో దళితులు అనుభవించిన అవమానాలకు, బహిష్కరణలకు, సమాజంలో తగిన స్థానం లేని పరిస్థితులకు నిలువుటద్దం ఈ కవిత. శూద్రుని కవిత్వాన్ని ఆస్వాదించడమంటే, కాకి ఎంగిలి చేసిన ఆహారాన్ని భుజించినట్లేనని అప్పకవి, ఆ వారసులు దళితుల్నీ, దళిత కవిత్వాన్ని పరిగణించే దయనీయమైన పరిస్థితి నేటికీ పూర్తిగా పోయిందని గుండెల మీద చేయేసుకొని చెప్పలేం. ఈ కవితలో కొన్ని తరాలుగా దళితులు త్రాగడానికి మంచినీళ్ళకోసం ఎదుర్కొన్న సామాజిక వ్యవస్థీకృత సంఘర్షణను కూడా అద్భుతమైన అభివ్యక్తితో వర్ణించాడు కవి. దళితుల జీవితం, ముఖ్యంగా నీటి వంటి ప్రాథమిక వనరులకు సైతం అవకాశం లేని పరిస్థితినీ ఈ కవితలో వివిధ ప్రతీకల ద్వారా మరింత స్పష్టంగా వర్ణించాడు. “నీలాకాశపు ఎడారి” ద్వారా దళితుల నిరాశ, అనుభవించే పాశవికత, సామాజిక విస్మరణ ప్రతిబింబించగా, “ఒంటరి ఒంటె” వారి అవహేళన భరించాల్సిన సామర్థ్యాన్ని సూచిస్తుంది. భారతదేశంలో దళితుల నిత్య జీవితంలో నీటి కోసం చేసే పోరాటాలు సామాజిక వివక్షతను వ్యక్తీకరిస్తాయి. అనేక గ్రామాల్లో బావులపై, చెరువులపై సాంప్రదాయంగా ఉన్న యజమానత్వం దళితులను వాటికి దూరం చేస్తుంది. ఈ కవితలోని “ఒయాసిస్సులు కూడా కన్నీటి బొట్లను ఆపేసుకుంటాయి” అనే వాక్యం, దళితుల గాధను చూసి ప్రకృతి కూడా సతమతమవుతుందని ఒక స్ఫూర్తివంతమైన దృశ్యాన్ని చిత్రీకరిస్తుంది.

డాక్టర్ గిన్నారపు ఆదినారాయణ పద్య కవిత్వంపై ఎం.ఫిల్. చేశాడు. దళిత ఆత్మకథలపై డాక్టరేట్ చేశాడు. ఓరియంటల్ కళాశాల నుండి వచ్చి, సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లో తన ఉన్నత విద్యను పూర్తి చేసుకున్నాడు. తను విద్యార్థిగా, పరిశోధకుడుగా, విద్యార్థి నాయకుడుగా, ప్రస్తుతం ఒక అధ్యాపకుడిగా ఉన్నప్పటికీ తాను విస్తృతంగా అధ్యయనం చేస్తున్నాడు. గతంలో ‘నానీల సుగంధం’( 2023) పేరుతో తన తొలి కవితా సంపుటిని వెలువరించాడు. దాన్ని రవీంద్ర భారతిలో తన గురువు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గార్కి అంకితం చేశాడు. కవిత్వం ఒక తీరని దాహం. తన చుట్టూ ఉన్న సమాజాన్ని, ఆ సమాజంలోని వివిధ పారలను సూక్ష్మంగా పరిశీలిస్తున్న నేపథ్యంలో మళ్లీ అనేక కవితలయ్యాడు. ఎవరికైనా సాంఘికీకరణ ప్రక్రియ (Social-ization) లో కుటుంబం ప్రధానమైన పాత్రను పోషిస్తుంది. ఆ తరువాత పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయి వరకు మరొక సమాజాన్ని అభ్యసింపచేస్తుంది. మరలా సమాజంలో ఒక పౌరుడిగా తన విధులు నిర్వహించేటప్పుడు చట్టం, న్యాయం మరికొన్ని నియమ నిబంధనలు నేర్పుతాయి. ఇవన్నీ సాంఘికీకరణ ప్రక్రియలో వివిధ దశలు. వీటన్నింటి గురించి ఆదినారాయణ కవిత్వం అయ్యాడు. అమ్మ నాన్నలలో నాన్న గురించి కవిత్వం రాసినా, రాయకపోయినా బహుశా తన అమ్మ గురించి కవిత్వం రాయని కవి ఉండడు. ఈ కవి కూడా తన తల్లిని ఒక ప్రేమమూర్తిగా, ఆత్మీయ మూర్తిగా తమకు అందించిన వివిధ అనురాగ పార్శ్వాలను ఎన్నో భావచిత్రాలుగా చూపించాడు. తన తల్లిలోని శ్రమైక జీవన సౌందర్యాన్ని తలచుకొని మురిసిపోతాడు.

**“దండెం అమ్మ పుట్టింటి ఆస్తి.
ఆ దండెం దగ్గర
నాన్నకు చోటే ఉండదు
దాని పూర్తి హక్కులు అమ్మవే.”**

ఇంట్లో పనులు చేయటం, బట్టలు ఉతకడం, వంట చేయడం దీనితో పాటు పొలం పనులు చేయడం తరతరాలుగా స్త్రీకి మాత్రమే సంక్రమించిన పనులుగా మారిపోయిన స్థితిని అద్భుతంగా వ్యక్తీకరించాడు కవి.

మనుచరిత్రలో అల్లసాని పెద్దన సంసారం గొప్పతనాన్నీ, భార్యాబిడ్డలు, కుటుంబం, ఆ గృహస్థ జీవితంలోని ఔన్నత్యాన్ని వర్ణిస్తూ భారతీయ జీవన విధానాన్ని వేనోళ్లా కీర్తించారు. ఈ కవి ఆదినారాయణ కూడా ఇల్లుని వర్ణిస్తూ అటువంటి పనే చేశాడు. ఇంట్లో ప్రతి ఒక్కొక్కరికి మధ్య ఉండే అనురాగాన్నీ, బాధల్నీ, బాంధవ్యాల్నీ, వారి వారి అస్తిత్వాల్ని అద్భుతంగా వర్ణించి, ఆధునిక భారతీయ సమాజంలో కూడా కుటుంబ వ్యవస్థ యొక్క గొప్పతనం కొనసాగుతూనే ఉందని పరోక్షంగా సూచించాడు.

**“ఇల్లంటే
చెమ్మగిల్లిన కన్నీటి బొట్లను
బరువెక్కిన హృదయాన్ని
మనసారా నవ్విన జ్ఞాపకాలను
నడుస్తున్న వంటగదిని
ఒక్కసారి స్పృశించడం.”**

ఇల్లంటే ఎవరెవరు? తల్లి, తండ్రీ, అన్నదమ్ములు, భార్యాభర్తలు, బిడ్డలు, బంధువులు ఒకరేమిటి! అనేక బంధుత్వాలతో ముడివేసుకున్న అనురాగాలు. ఆదినారాయణ వీళ్ళందరినీ సందర్భం వచ్చినప్పుడల్లా కవిత్వం చేశాడు.

**‘పనికాడ తల్కాయకు తువ్వాల గట్టి
పారవట్టి పనిజేస్తే / పద్దు మొగోడు గూడ పన్కిరాడు
పార, పలుగు, కొడ్వలి చేతబట్టిందె
ఐనా పెన్ను వట్టినోల్ల కంటే లగాంచి మాట్లాడుత– దబ్బున నాకు జరమత్తే
కడ్పుమీద తడిబట్టేసి పెయంత రుద్ది
ఫ్యాన్ దిరిగినట్టు తిరుగుద్ది / నా మంచం సుట్టు”**

మనకెన్ని భాషలు వచ్చినా, అమ్మ పలుకులలోని ఆత్మీయత దేనికీ రాదు. కవి సందర్భోచితంగా తెలంగాణ పలుకుబడిలోని సౌందర్యాన్ని పట్టి చూపించాడు. ‘జననీ జన్మభూమశ్చ స్వర్గాదపీ గరీయసీ’ అనే శ్లోకం తల్లి గొప్పతనాన్ని, తాను జన్మించిన భూమినీ ప్రశంసిస్తుంది. అందుకే ఈ శ్లోకం ఒక సూక్తిలా కూడా మారిపోయింది. కానీ, కవి గిన్నారపు ఆదినారాయణ తల్లడిల్లే తల్లి హృదయాన్ని కూడా పట్టుకున్నాడు.

**“ఆ కిటికి కోసం / ఎన్నిసార్లు ఖరాఖండిగా
నేను అక్కడి నుండి లేవనని చెప్పానో
ఎన్ని అబద్ధాలు ఆడానో / అదే కిటికి కోసం
ఎన్నిసార్లు బతిమాలానో / ఇలా కిటికి ఒక మధురానుభూతి”**

ఈ కవిత సాధారణం లో అసాధారణతను గుర్తించు అనే సందేశాన్ని అందిస్తుంది. ఈ కవితలో సాధారణం లో అసాధారణత అనే భావనను జీవితంలోని భావోద్వేగాల వైకల్యాలను, వాటి సంక్లిష్టతను వ్యక్తీకరించే ఒక నదిలాంటిది. కవితలో “కిటికి” అనేది ఒక సాధారణమైన భౌతిక వస్తువు కాదు, ఇది జ్ఞాపకాలు, కోరికలు, మరియు ఆశల సమ్మేళనానికి ప్రతీక. ఇది మానసికస్థితి (Psychological State)కు ప్రతిరూపం. సాధారణ వస్తువును అసాధారణంగా మార్చే కళను కావ్యతామయత (Poetic Aesthetic)




ప్రతులకు: గిన్నారపు ఆదినారాయణ
సెల్: 9949532456

గిన్నారపు ఆదినారాయణ రచించిన ‘తొవ్వ నేర్పిన పాఠం’ పుస్తకానికి ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు రాసిన ముందు మాట.

అంటారు. “కిటికి ఒక మధురానుభూతి” అనే వాక్యం, కవి జీవితంలోని సాధారణ అనుభవాలకు కొత్త ధ్రువాలను (New Dimensions) ఇవ్వగల సామర్థ్యాన్ని సూచిస్తుంది. ఈ కవితలో “కిటికి” వ్యక్తి జీవితం లోని సాధారణ అనుభవాలకు అసాధారణ భావాన్ని జోడిస్తుంది. అదొక నోస్టాల్జియా. ఈ కవితలో పదార్థాల వ్యర్థత (Banality of Objects) ను అసాధారణతలోకి మార్చి భావోద్వేగాల విశిష్టతను వెలుగులోకి తీసుకురావడంగా కవి భావించాడు. అసాధారణత అనేది ప్రతిరోజు జీవనంలో, చిన్న చిన్న విషయాలపై మన హృదయస్పందనలను గుర్తించగల తత్వానికి సంబంధించినది. సౌందర్యతత్వం(Aesthetics) ప్రతి ఫలించింది. ఇలాంటిదే మరొక కవిత. మనం చాలా సాధారణమైనట్లుబావించే వాటిలో అసాధారణమైన తాత్వికతను గుర్తించడం కవి గొప్పతనం.

**‘డిసెంబర్ 31 / జీవన గమనానికి
అంచలంచెల / ఆయుష్షు దించే మెట్టే తప్పా
పెంచే మెట్టు కాదు.
××
××
నిన్నటి చీకటిని మర్చిపోయి / రేపటి వెలుగును ఆస్వాదించడానికి
ఎంతటి ఆరాటం / పోరాటమై సాగుతుందో
నిత్యం చూస్తూనే ఉన్నాం.”**

అన్నప్పుడు ఆదినారాయణ ఒక తాత్వికుడిలా కనిపిస్తాడు.

మానవ జీవితంలో మార్పు, కాలచక్రం, మనసు నిరంతర ప్రయాణానికి ప్రతీకగా నిలుస్తుంది. డిసెంబర్ 31 అనే ఒక తేదీ, ఒక సంవత్సరానికి ముగింపు. కొత్త సంవత్సరానికి ఆరంభాన్ని సూచిస్తూ, సమయ తాత్వికత (Temporal Philosophy)తో ముడిపడిన జీవన తాత్విక ప్రశ్నలను రేకెత్తిస్తుంది.

“అంచలంచెల ఆయుష్షు దించే మెట్టే తప్పా, పెంచే మెట్టు కాదు” అనేది మనిషి జీవితంలో సమయ సంక్షిప్తత (Temporal Finitude)కు ప్రతీక. కాలం అనేది కేవలం నశించేవాటిని తగ్గించడానికే ప్రయత్నిస్తుంది. కానీ, అదనంగా దేన్నీ పెంచదు. ఇది సమయ క్రమబద్ధత(Linear Temporality)ను ప్రతిబింబిస్తుంది.”నిన్నటి చీకటిని మర్చిపోయి రేపటి వెలుగును ఆస్వాదించడానికి” అనే వాక్యం, జ్ఞాపకాల తాత్వికత (Philosophy of Memory), భవిష్యత్ ఆశల తాత్వికత (Philosophy of Hope) మధ్య ఉన్న ద్వంద్వ సంఘర్షణను ప్రతిబింబిస్తుంది. జ్ఞాపకాలు మన జీవితాన్ని నిర్మించే మార్గాలు, అయితే, భవిష్యత్ ఆశలు జీవన ఉత్సాహానికి దోహదం చేస్తాయి. దీన్ని స్మృతి భవిష్యత్ ఆశల మధ్యగల వ్యతిరేకత(Tension between Memory and Hope) గా చెప్పుకోవచ్చు. మానవ ఆరాటం(Existential Struggle):” ఎంతటి ఆరాటం పోరాటమై సాగుతుందో” అనే వాక్యం, మనిషి యొక్క అస్తిత్వ పోరాటం (Struggle for existence)ను సూచిస్తుంది. ఇది జీవన పరిణామక్రమం (Evolutionary Imperative) తో ముడిపడిన తన మనుగడ కోసం చేసే నిరంతర ప్రయత్నాన్ని ప్రతిపాదిస్తుంది. డిసెంబర్ 31 అనేది జీవనచక్రం (Life Cycle)లో ఒక ప్రతీక. ఇది ఒక ముగింపును సూచించినప్పటికీ, అదే సమయంలో పునః ప్రారంభానికి అవకాశాన్ని సృష్టిస్తుంది. ఇది చక్రాకార సమయ తాత్వికత (Cyclic Temporality)కు సంకేతం. దీన్ని సంవత్సరాంతానికి ప్రతీకాత్మకత (Symbolism of Year End)గా చెప్పుకోవచ్చు. “రేపటి వెలుగును ఆస్వాదించడానికి” అనే భావం, ఆశావాద తత్వం యొక్క విభిన్న కోణాన్ని ప్రతిపాదిస్తుంది. కవిత భవిష్యత్ ఆశల వైపు దృష్టిని నిలిపి, జీవితంలో పునః ఆరంభాలు అర్థవంతమని సూచిస్తున్న ఆశావాద తత్వాన్ని (Optimistic Existentialism) చెప్పాడు కవి.

ఇలా ప్రతి కవితను వ్యాఖ్యానించుకుంటూ పోతే ఒక పెద్ద గ్రంథమే అవుతుంది. కవి గిన్నారపు ఆదినారాయణ మౌనంగా ఉంటాడు. మహా సముద్రం లాంటివాడు. ఆ సముద్రం ఎన్ని బడబాగ్నులను తనలో దాచు కుందో. అన్వేషిస్తే గాని తెలియదు. అతను కూడా అంతే. అతని వ్యక్తిత్వం కూడా అంతే. ఈమధ్య డాక్టర్ ఎన్. గోపి గారి కవిత్వాన్ని బాగా అధ్యయనం చేస్తున్నాడు. అది ఇతని కవిత్వంలో బాగా కనిపిస్తుంది. గోపిగారి గురించి కూడా దీనిలో ఒక గొప్ప కవితను రాశాడు. ఆయన వ్యక్తిత్వాన్ని ఆయన రాసిన కవిత్వాన్ని ఆ కవితలో గొప్పగా ఆవిష్కరించాడు కవి. పేదరికం తారాస్థాయి ఎలా ఉంటుందో మరొక కవితలో చెబుతూ

**“పాలు, పండ్లు, టిఫిన్లు
మా ఇంటికి అతిథులయ్యాయంటే
రోగం మా ఒంట్లో జేరినట్లు లెక్క
రోజుతినే బువ్వకు సెలవిచ్చి
ఇన్ని రకాల తిండి దొరుకుతుందంటే
జరాన్ని ఎందుకు కోరుకోం మరి
జరమొస్తనే గద దొరికేది
మాకివ్వన్ని ఇంక నాల్రోజుల ఇట్లనే ఉంటె
బాగుండు అనిపించేది”** ఆరోగ్యం కోల్పోయినప్పుడు పేదవాళ్ళ జీవితాల్లో ఎదురయ్యే ప్రత్యేక పరిస్థితిని సూచిస్తుంది. నిత్యం అందుబాటులో లేని పౌష్టికాహారం, రోగ సమయంలో అందించినా, దాని వెనుక దారుణమైన అనుభవాల్ని కవి సూచిస్తున్నాడు. ఇది అనూహ్య తార్కికత (Irony of Circumstance)కు ప్రతీక.

“ఇన్ని రకాల తిండి దొరుకుతుందంటే జరాన్ని ఎందుకు కోరుకోం మరి” అనడం ద్వారా సంతృప్తి, విచిత్ర ఆకాంక్షల ద్వంద్వాన్ని ఆవిష్కరిస్తుంది నాడు. రోగం కారణంగా దొరికే ప్రత్యేక సేవలు, ఇవన్నీ సాధారణ జీవితంలో దొరకడం అనుమానాస్పదమనే వ్యంగ్య స్వరాన్ని పలికిస్తున్నాడు కవి. “జరమొస్తనే గద దొరికేది” అనే వర్ణన మన జీవితంలోని Irony of Lifeని ప్రతిపాదిస్తుంది.

రోగం ద్వారా వచ్చే ప్రత్యేకతలను, కష్టాలపై ఉన్న వ్యంగ్య స్వభావాన్ని ప్రతిబింబి స్తుంది. ఇది అసాధారణ పరిస్థితు ల్లో సహజ అనుభూతి (Natural Feeling in Unnatural Situations) అనే సిద్ధాంతాన్ని చర్చిస్తుంది.

ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు ఇలాంటి వస్తువులే తీసుకొని కరుణ రసార్ద్రంగా ఒక కథ రాశారు. పేదరికంతో బాధపడుతున్న ఒక అమ్మాయికి లారీ యాక్సిడెంట్ కావడం, ఆ సందర్భంగా అనేకమైన ఆహార పదార్థాలు వస్తూ ఉంటాయి. అందుకని ఆకలి వేసినప్పుడల్లా లారీ కింద పడిపోదామనుకుంటుంది. ఆ కథ విషాదాంతంగా, వాస్తవికతతో ముగిస్తుంది. ఆ కథ చదివిన తర్వాత పాఠకులు చాలా సేపు మామూలు మనుషులు కాలేరు. పేదరికం, వాస్తవిక అనుభవాలు రచయిత, కవులను ఒకే రకమైన వస్తువుతో రచనలను చేసేలా ప్రేరేపిస్తాయి.

**“కరోనా కాలంలో
క్లాస్రూమ్ క్లాసులకు కత్తెరవేసి
ఆన్లైన్ క్లాస్లకు ఆహ్వానం పల్కడం
పురోగమనమో తిరోగమనమో కానీ
బ్లాక్ బోర్డు మీదున్న ఫీలింగ్ స్క్రీన్ బోర్డులో లేదు”**

కరోనా కాలంలో జీవించిన కవి గాని, రచయితగాని దాన్ని స్పర్శించకుండా రచనలు కొనసాగించలేరు. కరోనా సమయంలో ఎదుర్కొన్న పరిస్థితులను కవి ఒక విద్యార్థిగా, ఒక అధ్యాపకుడిగా తన వాస్తవిక అనుభవాలను కవిత్వం చేశాడు.

కవి డా.గిన్నారపు ఆదినారాయణ తన కవితా సంపుటికి పెట్టుకున్న పేరు ‘తొవ్వ నేర్పిన పాఠం’ పేరుతో ఒక కవిత రాశాడు.

**“ఆ తొవ్వను చూసినప్పుడల్లా
ఆకాశంలో అందమైన చందమామను
చూసినంత ఆనందం / అందరు ఆ తొవ్వలో
ముళ్ళుంటాయని / చెప్పులు తొడుక్కొని నడిస్తే
నేను అక్షరాలు తొడిగి నడిచాను.”**

ఈ కవితలో ఒక దళితుడు విద్యార్థిగా తనకు అంతకు ముందు అందని చందమామలా, అందని ద్రాక్షలా ఉన్న చదువుని తాను చదువుకోవాలని ఉంచుకున్నాడు. భారతీయ సామాజిక జీవన క్రమాన్ని, దళితుల ఆలోచనా విధానంలో వచ్చిన మార్పుల్ని ఈ కవిత వర్ణిస్తుంది. ఆ క్రమంలో ఎదురైన అడ్డంకులను, అంతిమంగా సాధించిన విజయాల్ని కూడా చిత్రిస్తుంది. అది భారతదేశంలో కవి వ్యక్తిగత పోరాటం కాదుబీ తరతరాలుగా దళితులు చేసిన పోరాటానికి ఒక వ్యవస్థీకృత ప్రతీక. ‘తొవ్వ’ అనేది కేవలం ఒక భౌతిక వస్తువుగా కాకుండా, జీవితంలో ఎదురయ్యే సవాళ్లకు ప్రతీకగా నిలుస్తుంది. అయినప్పటికీ, కవి ఈ సవాళ్లను అధిగమించి, దళితులు ఎలా విజయం సాధిస్తున్నారో ఎంతో స్ఫూర్తిదాయకంగా, ఆదర్శనీయ దృక్పథంతో వర్ణించాడు.

ఒక వర్గం నుండి మరో వర్గానికి, ఒక స్థాయి నుండి మరో స్థాయికి వెళ్లే ప్రక్రియనే సామాజిక చలనశీలత అంటారు. భారతీయ దళితులు చదువుకొంటూ తమ సామాజిక స్థితిని మెరుగు పర చుకున్న పరిణామాలను వర్ణిసున్నాడు. ‘ముళ్ళుంటాయని చెప్పులు తొడుక్కొని నడిస్తే నేను అక్షరాలు తొడిగి నడిచాను’ అనే వాక్యం సామాజిక వర్గాల మధ్య ఉన్న అంతరాన్ని, దాన్ని అధిగమించిన తెలివితేటలను చూపుతుంది. భారత రాజ్యాంగం అందించిన సమానత్వం అనే భావనను అందరికీ సమాన అవకాశాలు లభించాలనే ఆకాంక్షను తెలియజేస్తుంది. కవిత చివరిలో ఆకాశంలోని చంద్రునితో పోల్చడం ద్వారా ఆశావాదాన్ని ప్రదర్శిస్తుంది.

**“ఆ తొవ్వలో అందరి ముఖాలు
పౌడరేసుకొని మెరుస్తుంటే
నాది మాత్రం / పరీక్షల్లో ఫస్టొచ్చిన రోజే మెరిసేది.
ఆ తోవ్వలో గాయాలు అందరికి
శరీరానికి తాకితే / నాకు మాత్రం మనస్సుకు తాకేవి.”**

తొలి తరం దళితులు ఎదుర్కొనే భౌతిక, మానసిక సంఘర్షణలను ఇక్కడ కవి అద్భుతంగా వ్యక్తీకరించాడు. నేటికీ ప్రతిభావంతుడైన దళితుడు తాను ఏదైనా సాధించినప్పటికీ రిజర్వేషన్ తో ముడు పెట్టి చూడడమే తప్ప అతని ప్రతిభను గుర్తించని సమాజంలో ఉన్నాం. ఒక స్కూలులో విద్యార్థిగా చేర గానే, అతడు దళితుడు అని తెలియగానే తాను వేసుకునే బట్టలు, తినే ఆహారం, మాట్లాడే మాటలు అన్నింటి లోనూ ఈ మానసిక గాయా లను ఎదుర్కోక తప్ప దు. పౌడర్ అనేది ముఖాన్ని అందంగా కనిపించేలా చేసే ఒక సామాజిక గుర్తింపు (Social Recognition) లేదా బాహ్య ప్రదర్శన (External Appearance)ని సూచిస్తూ **“ఆ తొవ్వ లో అందరి ముఖాలు / పౌడరేసుకొని మెరుస్తుంటే”** అని ఎంతో వ్యూహాత్మకంగా వర్ణించాడు. సామాన్యంగా, సమాజంలో మనం ఎలా కనిపిస్తున్నామో, మన ప్రతిష్ఠ ఎలాంటి ఉందో అనే దానిపై సామాజిక దృష్టి ఉంటుంది. సామాజిక అలవాట్లు (Social Habitus) అనేవి మానవుల ప్రవర్తనకు, వారిచ్చే మర్యాదలు, విజయాలపై ఆత్మ గౌరవం ఆధారపడు తుంది.”నాది మాత్రం / పరీక్షల్లో ఫస్టచ్చిన రోజే మెరిసేది” అనడం ద్వారా ఎప్పుడన్నా, ఎవరైనా మెచ్చుకున్నా అది బాహ్య విజయం(External Achi evement)గానో, తాత్కాలిక గౌరవం గానో చూసే పరిస్థితిని తెలుపుతుంది.

**“ఆ తోవ్వలో గాయాలు అందరికి / శరీరానికి తాకితే/ నాకు మాత్రం మనస్సుకు తాకేవి”** అని కవి అనడంలో తరతరాల దళితులు పడిన అవమానాలు, వాటి వల్ల మానసికంగా కుంగి పోవడాలను ఎన్నింటినో సూచి స్తుంది. మానసిక గాయా లు (Mental Wounds) అందరికీ స్పష్టంగా కనిపించవు. చేతన, అచేతన 'స్థితులు ఒకే కాలంలో సంభవించవచ్చు. ఇది ఇంటర్నల్ కంట్రాడిక్షన్ (Internal Contra-diction)ని ప్రతిబింబిస్తుంది, ఎప్పుడు గమనించలేని బాధతో మనసు అశాంతిగా ఉంటుం ది. “నాకు మనస్సుకు తాకేవి” అనడం ద్వారా ఉపరితల సామా జిక గాయాలు (Superficial Social Injuries) కంటే ఆత్మ సంబంధ గాయాలు (Self-related Wounds) మరింత తీవ్ర తను కలిగిస్తాయనేది భారత దేశంలో దళితులకు మాత్రమే తెలుస్తుంది. దాన్నిక్కడ ఎంతో శక్తివంతంగా ప్రయోగించాడు కవి. మొత్తం మీద ఈ కవితలో బాహ్యగాయాలు (Physical Wounds),అంతరంగ గాయాలు (Mental Wounds) మధ్య ఉన్న వ్యత్యాసం (Contrast)ని చూపిస్తూ, సామాజిక సమీకరణలు, మానవ మానసిక స్థితి, ఆత్మగౌరవం గురించి తాత్వికంగా మాట్లాడుతున్నాడు కవి. కొన్ని భాగాలు కవి వ్యక్తిగత జీవితానికి ముడి పెట్టినట్టుగా కూడా అనిపిస్తాయి.

ఈ కవిత వస్తు పరంగాను, నిర్మాణ పరంగాను గొప్ప కవిత. ఇలాంటి కవితలు ఈ కవిత సంపుటిలో చాలా ఉన్నాయి. తన కూతురు గురించి వర్ణించిన ‘చిట్టితల్లి’ కవిత గాని, మట్టి మనిషి నాన్న, వారసత్వం ఇంటివన్నీ అద్భుతమైన కవితలు. వీటితో పాటు దండోరా ఉద్యమం, తాను చదివి ఉద్యమాలలో తిరిగిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ హాస్టల్, పారిశుద్ధ్య కార్మికులు ఇలా అనేక కవితలు ఈ కవి ప్రగతిశీలతను తెలియజేస్తాయి. సాధారణమైన పదాలతో అసాధారణమైన కవిత్వాన్ని చేయడం ఎలాగో ఆదినారాయణ తెలుసుకున్నాడు. పూర్వ కవులు వాడిన పదాలను తాను సాధ్యమైనంత వరకు తన కవిత్వంలో వదల్చుకుంటే తనదైన ముద్ర ఏర్పడుతుందనేది కూడా గమనించాలి. ఒక ఆత్మీయ స్పర్శ, ఒక సామాజిక ఉద్యమ కెరటం, సమకాలిన సమాజ ప్రతిబింబంగా ఈ కవితా సంపుటిని తీసుకొస్తున్న ఆదినారాయణ ను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ●

## అందరిని బతుకనీయండి

రష్యా ఉక్రెయిన్ యుద్ధం!
అమెరికా ఇజ్రాయేల్
ఇరాన్ యుద్ధం!
ప్రపంచ గతిని
మార్చేస్తున్నాయి!
మానవాళి బతికే హక్కులను
కాలరాస్తూ,
విషం చిమ్ముతూ ,
విధ్వంసం చేస్తున్నాయి!
మొదటి యుద్ధానికి అయిదేళ్లు!
రెండోది కొన్ని వారాలే!
ఈ ఆధునిక శాస్త్రీయ ప్రపంచంలో
యుద్ధాలు తెచ్చిన
ముప్పులు అంతా ఇంతా కాదు సుమా!
ఒక్కసారి మనసుపెట్టి
ఆలోచించాలని కోరుతున్న!
మీరు ఎవరికీ వినరని తెల్సు
ఎవరి మాటలు పట్టించుకోరని తెల్సు!
ఈ యుద్ధాలతో మీరు సాధించింది ఏమిటి?
మీకు మీరే
ఒక్కసారి ప్రశ్నించుకోండి!
ప్రపంచ ప్రజల బతుకులను
మీరు అస్తవ్యస్తం చేస్తూ
అమాయకుల ప్రాణాలను
అనంతాకాశంలో కలిపేస్తున్నారు!
గెలుపు మాదే అని డంభాలు
పలుకుతున్నారు!
గెలుపంటే ప్రజల మనస్సులు
దోచుకోవడంగాని ప్రజలను
చంపడం కాదు!
ప్రజలను చంపి
గెలిచామని ప్రకటించడం
మూర్ఖత్వానికి,అజ్ఞానానికి ప్రతీక!
మీరు చేసే ఈ యుద్ధాలు
భూమిని ఎంత కలుషితం
చేస్తున్నాయో ఆలోచించారా?
పీల్చే గాలి కూడా కలుషితం
అయిపోతుంది!
మేఘాలు కారుమబ్బులతో
ఆమ్లవర్షాలను కురిపిస్తూ
ప్రజలకు చర్మ వ్యాధులను
తెచ్చిపెడుతున్నాయి!
ప్రపంచం రోగగ్రస్థమౌతుంది!
ఈ ఇంగిత జ్ఞానం లేదా మీకు?
యుద్ధాలు చేసే దేశాలే కాదు
యావత్తు భూగోళమే
మీ నిర్వాకంతో
విధ్వంసం అవుతుంది !
ఇప్పటికైనా ప్రపంచానికి మీరు
చేస్తున్న నష్టాన్ని తెలుసుకొని
యుద్ధాలను ఆపండి!
అందరిని బతుకనీయండి!



–డా॥దాశరథుల నర్సయ్య
9390919100

## నాణ్యత

నాణ్యత.. నాణ్యత.. నాణ్యత..
మాటల్లో.. పాటల్లో.. కవితల్లో.. కథల్లో..
ఉపన్యాసాలలో.. వాగ్దానాలలో..
వ్యాపార ప్రకటనల్లో.. వాణిజ్య రంగాల్లో..
అందరి నోట్లో.. అన్ని చోట్ల..
గింగిరాలు తిగుతున్న పదం నాణ్యత..
కానీ ఎక్కడా కనిపించదు నాణ్యత..
అంతా కల్తీనే..
మాట్లాడే మాటల్లో కల్తీ..
ఆలోచించే మనసుల్లో కల్తీ..
తాగే నీటిలో కల్తీ.. తినే ఆహారంలో కల్తీ..
పండించే పంటల్లో కల్తీ.. చేసే వంటల్లో కల్తీ..
కట్టడాలలో.. కర్మాగారాల్లో..
మందుల్లో.. మానవత్వంలో..
ఆఖరుకు మాతృత్వంలో కూడా కల్తీనే..
అండాన్నిచ్చేది ఒకరు..
అద్దెకు గర్భాన మోసేది ఒకరు..
ఇంకెక్కడి నాణ్యత.. ఊకదంపుడు ఉపన్యాసాల్లో తప్ప..
ఉబుసుకుపోని కబుర్లలో తప్ప..



–కందాళ పద్మావతి
కామారెడ్డి జిల్లా

## ఊపిరి దీపం ఆర్పకు

మనిషి అంతరిక్షంలో
అడుగుపెట్టినా
కడలి లోతులను కని పెట్టినా
అవనిపై
అద్భుతాలను ఆరబోసినా
మనిషి మాత్రం ఒంటిమామిడి
చెట్టైతాండు
ఎండిపోయిన ఏటి గట్టైతాండు.
పెదవులపై ప్లాస్టిక్ నవ్వులు
కడుపు నిండా
కుల్లుతున్న కుట్రలు
మనిషి , పైకి గంభీరంగా కనిపించినా
లోపల తనకు తానే తగలబడ్తాండు
బతుకు కడలిలో చెలరేగిన అలలకు
శిరస్సు తెగిన
కోడిపిల్ల లా కొట్టుకుంటాండు.
గుండె చుట్టూ ముసిరిన సమస్యలను
పది మంది ముందర పారబోయకుండా
కడుపులో పేర్చుకొని కాల్చుకుంటాండు
ఇరుగు పొరుగుతోటి
ఇంపుగా ఇమడకుండా
తనకు తానే హౌస్ అరెస్ట్ ఐతాండు
మనిషి ఇప్పుడు “ఇగో”
బంధంలో ఇరుక్కొని
బతుకు నావను ఈదుతున్నాడు.
అంబలి లేనోడైనా అంబానైనా కష్టాల
కావడి మోయాల్సిందే
గాయాల చినుకులలో తడవాల్సిందే
చిరు జీవితాన్ని చిత్తడి చేసి
మనకు మనమే
గుండెకు సెలవు చీటి రాస్తే
ఎలా? మనకు మనమే
ఊపిరి దీపాన్ని
ఆర్పితే ఎలా ?
ఏటికి ఎదురీదే
చేప పిల్ల ధైర్యాన్ని.చూడు
పడిలేస్తున్న కెరటం కసిని చూడు
వరదకు వంగిపోయే గడ్డి పర్కను చూడు
సాలె పురుగు ఆత్మస్థైర్యాన్ని చూడు
ఉన్న స్థితి నుంచి ఉన్నతి వైపు ఆలోచిస్తూ
మనసు విప్పుకోవాలి
మాటలు పంచుకోవాలి
అందరితో
ఆనందాల తోటలో విరబూయాలి



–తాటిపాముల రమేశ్
7981566031

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1774వ రోజు 'పిచ్చివాడి చేతిలో రాయి' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'పిచ్చివాడి చేతిలో రాయి' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు

***మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక&దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం***

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:

***-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,9441046839***



## హర్మూజ్ జలసంధి

మనుషులందు మహాత్ములు వేరయా
నాటి మాట
పాలకులైన పిచ్చివాళ్ళ చేతుల్లో రాళ్ళు
నేటి మాట.
ఉన్నది చెబితే పిచ్చోడంటారు
అబద్ధం చెప్పడం
అసలు నిషానీలకు అతకదుగా.
ప్రపంచీకరణలో ఖండాలన్నీ
మునకేయించిన ప్రైవేటీకరణ
సరళీకరణ విధానాలే నాజూగ్గా
నాణ్యతకు పెద్దపీట అట.
గ్లోబలైజేషన్ ఆటలో
అరటి తొక్కపై కాలేసి జారిన దేశాలెన్నో!
పవర్
పెద్దన్నల పాత్ర పోషించే నేతల చేతుల్లో
ద్రవ్యోల్బణ సూచీ
అతలాకుతలం ఆగేదెన్నడో?.
వాడి డాలర్ల గోతాములో పడిపోయాకా
పొడి పొడిగా ధరలు చుక్కలు చూపిస్తుంటే
మాయా తెరలను బహిర్గతం చేసే నల్లనయ్యలేరి!.
వాడిని నమ్మి బట్టకట్టిందెవరు?
యుద్ధం లేకుండా శాంతి గా గడిపిన కాలమెంత!.
వాడు వంటగదిలో గ్యాస్ పొయ్యి ఆర్పేస్తూ
ప్రపంచానికి శాంతిని ప్రసాదించే.
అమృత హస్తం తనదేనని
మహా బింకాలు పోతుంటే
హర్మూజ్ జలసంధి లో చమురు ధరల వాతలు.
సామాజికంగా
సామాన్యుల తలరాతలను మార్చే
యుగ యుగాల నుండి
పిశాచ పాలకుల చెఱ ఆగిందెన్నడూ!.
రావణాది కీచక
దుర్యోధన దుశ్శాసన పర్వం
ఇంకా ఇంకా కొనసాగుతుంటే
భూతల్లి బాంబుల మోత
ఉష్ణ తాపానికి గగ్గోలు పెడుతూ
కళ్ళుండీ చూడలేని
పిచ్చోళ్ళ పాలనలను శపిస్తూ
విలపిస్తుంటే!.
దుర్మార్గుల దుశ్చర్యలను ఖండించే
జనరేషన్ నిద్రలేవకుంటే
రేపటి తరానికి
బానిసత్వం బట్వాడా చేయడమే!.
చెడును చెడుగుడు ఆడే
యువతకు వందేమాతరం
అధికార మదోన్మత్తులను ధిక్కరించి
సంస్కార బాట చూపే విదురులకు స్వాగతం.

**-ఏడెల్లి రాములు**

## ఎందుకు పెట్టాలోయ్!?

పిచ్చివాడి చేతిలో రాయి
అసలెందుకు పెట్టాలోయ్!?
ఎప్పుడు ఎక్కడ ఎవరికి తగులుతుందో
పుచ్చ పుచ్చకాయ లా పగులుతుందో
తెలీని రోజులోయి.
మిటమిట ఎండల్లో
చిటచిట పేలాల మోహాలు
యుద్ధపు రోజులు
పెట్రోల్ మంటలు
లేవు వంటలు.
మద్యం మత్తులో తూలుతూ
వాడినోట కారుకూతలు
అదే ఖరారోయి
బైట భగభగలు
ఇంట భుగభుగలు
రచ్చ అయి బుర్రవాచిన పార్టీలు
చుట్టూ బాజా భజంత్రీలు
ఆడోళ్లు
జగజ్జంత్రీలు.
అన్ని రంగాల్లో విందులు
పసందులు పందేరాలు
ఆనాడు
తుగ్లక్ ఢిల్లీ నుంచి దేవగిరికి
ఛలోఛలో అని తోలాడు
ఆపై పీఛే ముడ్ అంటూ
పిచ్చితుగ్లక్ గా చరిత్రలో మిగిలాడు.
నేడంతా పాగల్ ఖానాలో
ఖానా పీనా సోజానా
ప్రతివాడిచేతిలో రాయి కాదు రైఫిల్!
బెదిరింపులతో సవాల్.
నోటిదంతాలు పటపట
చేతిలో రాయి టపటప
ఊ అన్నా తప్పే
ఆ అన్నా ముప్పే.
కుతకుత కుతంత్రాలు
తెరవెనక నాటకాలు
జనాలకు పితలాటకాలు
పిచ్చోడిచేతికి రాయి ఇచ్చిన మనదే తప్పు
వదిలిస్తాడతను మన తుప్పు.

**-ఎ.రాజ్యశ్రీ**

## పిచ్చ పిచ్చగా!

పిచ్చి ముదిరింది
తలకు రోకలి చుట్టమన్నాడట.
ఒక్కొక్కరికి ఒక్కొక్క పిచ్చి
నాయకులకు ఓట్లపిచ్చి
ఆహార్యం బయటికి శాంతి, సహనం
మనసంతా అశాంతీ అసహనం
పైసా ఉంటే చాలు మందూ మత్తూ
రాళ్ళు విసురుతూ
ప్రజాధనాన్ని మింగేసే
ఎత్తుల పిచ్చి.
సిన సేపను పెద చేప
పెద చేపను ఇంకో పెదచేపా
లేచిన దగ్గర నుండి
ఎవరినైనా ముంచుదామనే పిచ్చి
తమ లాభం ఎంతో హద్దులేనంత
జనానికి విసిరేది
భిక్షాపాత్రలో
ఆకలి కూడా తీరని చింత..
ఉన్మాదం తలకెక్కిందంటే
ఎవరేం చెప్పినా వినడు
మూర్ఖత్వపు ఆలోచనలతో
మంచీ చెడూ చూడడు
నాకు స్పీడెక్కువ
నా ఇష్టం నాది అంటూ
నలుగురి మీదకెక్కించేస్తాడు
తనని తానే చంపుకొంటూ.
అంతా బాగున్నా
అన్నీ కుదిరినా
జాతకాల పిచ్చితో
సంబంధాలను కోల్పోతున్న
పిచ్చి నమ్మకం
ముహూర్తాల పిచ్చి
ఈరోజు బాగుందంటూ
రేపటి రోజు
బాగా లేదంటూ
దినకరునికి లేని
ముహూర్తం
మనుషులకెందుకో
సమయం వృధా చేస్తున్న
ముహూర్తాల పిచ్చి.
ఎవరిపిచ్చి వారికి
ఆనందం
లోకం పోకడ తెలిసి
నీవెందుకు వాగుతావురా పక్షీ!
అవగాహన లేని
ఆలోచించని భ్రమ పిచ్చి
రోజు రోజుకు ముదిరి
పోతున్న పిచ్చి!.

**-పి.పద్మావతి**

## స్వార్థపు రాజకీయములు

ఉ. స్వార్థపు రాజకీయములు సంఘమునెప్పుడు పాడుచేయు శ్రీ
వర్ధన మొక్క లక్ష్యము వివాదములెన్నియొ పెంచుచుండగా
నర్థములేనిపద్ధతులకాశ్రమిాయ వినాశకారియౌ
గార్దబమేలురాజ్యమున కల్మషమెక్కువ దాడిచేయునే:
ఉ. వేడుకనోటు పొందుట వివేకము వీడిన మోహమందుపి
చ్చోడికిరాయినీయగను శుద్ధమనస్కుల బాధపెట్టుచున్
చీడలుపట్టు వృక్షముగ చేటగులోకపు సజ్జనాళికిన్
వాడును సంస్కృతుల్, ప్రగతి వైభవమంతయునీరుగారగన్!
శా. పిచ్చోడెప్పుడు ముందు వెన్కలను సంభోగంపుటాలోచనల్
హెచ్చున్ సంతసమొందబోడు హృది ప్రత్యేకంపు మార్గమ్ముల
న్నిచ్ఛాశక్తిని నమ్మబోడు మరియాదన్ మాటరానీయకన్
దెచ్చున్ కీడు వికార దుష్టఫలముల్ తీవ్రంపు సందర్భముల్.

**-మాడుగుల నారాయణ మూర్తి**

## దూరంగా ఉండండి

పిచ్చివాడి చేతిలో రాయి పెట్టొద్దు!
ఆ రాయి ఎటు ఎగురుతుందో ఎవరి కెరుక?
అసలే పిచ్చి
ఆపై కల్లు తాగి ఉంటే,
ఏం మాట్లాడుతాడో
ఏం చేస్తాడో తెలీదు!
నడుస్తున్న మనుషుల పైకి రువ్వొచ్చు!
బస్సు కిటికీ అద్దాలు పగలొచ్చు!
ఇంటి అద్దాలు చితక్కొట్టొచ్చు!
ఈ పిచ్చి ముదిరితే ఉన్మాదం కావచ్చు!
ఉన్మాది తప్పక పైశాచికం చూపొచ్చు!
పైశాచికం ముదిరి రాక్షసం కావచ్చు!
ఏం జరుగుతుందో ఊహాతీతం!
ఉండాలి వారితో జాగ్రత్తగా!
ఇవ్వొద్దు పదవి ఏమీ తెలియని వారికి!
దేశాన్నే భ్రష్టు పట్టిస్తాడతడు!
డబ్బుకి ఆశపడి తప్పటడుగు వద్దు!
నిజాయితీని గెలిపిస్తే దేశం సుభిక్షం!
అరాచకం తగ్గి, అశాంతి మాయం!
అజ్ఞానికి అప్పనంగా అధికారమిస్తే
భద్రత గల్లంతు
మతి లేని వాళ్లకు
దూరంగా ఉండడమే
ఉత్తమం!!.

**-కోలా సత్యనారాయణ**

## అలవాటులో పొరపాటు

ఒకొక్కసారి అధికారం
హోదా, వసతులు
చుట్టుపక్కల
అడుగులకు మడుగులొత్తేవారు
శ్రమ పడకుండా
అనుభవం లేకుండా చిక్కాయంటే
కొంతమంది మతిచెడి
పిచ్చివారై పోతుంటారు.
చిక్కిన అధికారం
బరువు బాధ్యతలను నెరవేర్చే
రాయిగా ఉంటే అందరికీ క్షేమం
స్నేహ ప్రయోజన ఉపకారాల హేతువు
అదే రాయిని ఇచ్చవచ్చినట్లు విసిరి
గీకి, కొడితే ఇరు వర్గాలకూ హానికరం.
పిచ్చి ముదరనివ్వక
కుదిర్చే దిశలో అడుగులెయ్యాలి
కఠిన ప్రమాదాలకు దారి తీయని
మిథ్యా అధికార హోదాలు
మాత్రమే కల్పించాలి.
కోతికి కొరివి అందితే ఎలాగుంటుందో
పిచ్చివాడి చేతికి
రాయి దొరికితే
అలాగే
ఉంటుంది.

**-రాజప్ప**

## అవగాహనలేనివాడు

అవగాహన లేకపోవడం
ఆడంబరాలకు ఎగబాకడం
ఇంగితజ్ఞానం పెట్టకపోవడం
ఈ జగతిలో పిచ్చివాడవడం.
ఉసిరికాయంత తెలివి
ఊడలు పట్టి ఊరేగే పని
ఋణపడేది వాని తెలివి
లుప్త సహాయం కోసం చూసే పిసినారి.
ఎవరినైనా ఇరికించే జ్ఞాని
"ఏమో, నాకు తెలియద"నే పిరికి
ఐనా తప్పించుకోవడం తెలియని పిచ్చి
ఒడుదుడుకులు గ్రహించని మనిషి
ఒక మారు పాటు గ్రహించని ఋషి
ఔదార్యం చూపినా సహించని వ్యక్తి.
పిచ్చివాడి చేతిలో రాయి?
ఎవరికో భయం, ఎవరికో నవ్వు
అతని కన్నుల్లో మాత్రం
తెలియని కథ ఒకటి మిగిలి ఉంది.
అతను విసిరే రాయి
గోడల్ని కాదు, మనసుల్ని తాకుతుంది
అర్థం కాని ఆర్తితో
సమాజం వైపు అరుస్తుంది.
మనమతన్ని పిచ్చివాడని పిలుస్తాం
అతను మనల్ని మౌనులని చూస్తాడు
అతని రాయి ఒక ప్రశ్న?
"నిజంగా పిచ్చివాడు ఎవరు?".
అవగాహన లేకుండా తోసిన ప్రపంచం
అతని చేతికి ఒక ఆయుధం ఇచ్చింది?
అది రాయి కాదు-
మాటలేని వేదన.
ఒక రోజు ఆ రాయి పడిపోతే
అతని చేతులు ఖాళీ అవుతాయి
అప్పుడు మనం వినగలమా?
అతని హృదయం చెబుతున్న సత్యాన్ని?.

**-గుండవరం కొండల్ రావు**

## తిక్కలోడు

కంటితో చూసింది
మనసున తలిచింది
లాభ నష్టాలు అంచన వేయక
ఆలోచనే చేయక
అత్తిరి బిత్తిరి ఘనుడు
చేయాలనుకునేది చేసేయటమే
తోచింది తోసేయటమే
గద్దెక్కించిన జనానికి చావు
నమ్ముకొని అందలం అందించినవారికి
దుఃఖపు తావు
మరణాలు
ఆగడాలు
ఆనందాలు
ఆశ్వర్యాలు
చరిత్రలు
మానవత్వాలు
నాగరికతలు
అల్లకల్లోలం
ఆ పిచ్చోడి చేష్టల వైనం
వాడి చేతిలో రాయి
విసిరాడు
విసురుతూనే ఉన్నాడుపిచ్చోడికి
పట్టం కట్టి
రాయిస్తే
ఎటు విసిరేది తెలువదు
విసిరిన రాయి
నష్టాన్ని కలిగించటం ఖాయం.

**-జె.నరసింహారావు**

## కోపం ఎక్కువైతే...

మతిస్థిమితంగా ఉండదు
పిచ్చివానికి
ఏం చేస్తున్నాడో
తెలియదతనికి.
పిచ్చి ఏ సమయంలో
ఎక్కుతుందో
చెప్పలేరు ఎవరూ.
ఎప్పుడు ఏం చేస్తాడో అతనికీ
తెలియదు.
ఇంట్లో, బయట అతనితో
జాగ్రత్త
అతని చేతిలో రాయుంటే
ఎవరికి తగులుతుందో
ఎవరి తల పగులుతుందో
ఎవరి కాళ్లు విరుగుతాయో
చెప్పలేరు ఎవరూ.
అందుకే అంటారు
పిచ్చి వాని చేతిలో రాయి
అని
కొందరు ఏం చేస్తారో
తెలియదు
కోపం ఎక్కువైతే
అలాగే ప్రవర్తిస్తారు.
రెచ్చగొట్టకూడదు కోపంగా
ఉన్న వారిని
ఎప్పుడు ఎలా మాట్లాడాలో
తెలుసుకుని మాట్లాడాలి.
ఆలోచించి మాట్లాడాలి.
అహంకారం ఎక్కువైతే
కొంతమంది
అలాగే ప్రవర్తిస్తారు.

**-డా.షహనాజ్ బతుల్**

## పిచ్చెవరికి..?

చేతిలో పైసలుంటే చాలు
తెల్ల బట్టలేసుకొని నాయకుడై పోవచ్చుట
పైసలల్లనే పరమాత్ముడట
అవి ఉంటే ప్రజానాయకుడైనట్టేనట
"పైసా ఫేక్..తమాషా దేఖ్.."
నిస్వార్థ సేవకు కోట్ల కొద్దీ ఖర్చా..!
మతలబేందో తెలుస్తనే ఉండె
లోపలి మర్మమేందో సమజ్ కానేవట్టె..
అఆలు రానోల్లకు అధికారమట
అయ్యేయెస్సులు సలాంకొట్టుడట
పరిపాలన తెల్వది
ప్రజాసంక్షేమం పట్టది
కుర్చీల కూసోవాలె
ఖర్చుకు పదింతలు దోసుకోవాలె
పిస్స ఓటరు
ఓటనే రాయిని తుడ్సి చేతికిస్తే
ఎటు కొట్టాల్నోతెల్వక
గెలిసినోడు ఇచ్చినోడి మాడే
పగులగొట్టవట్టే.
నిజమే
పైసున్నోడికి- కాదు కాదు..
పిస్సోడి చేతికి ఎప్పట్నుంచో
పదవనే రాయినిస్తనే ఉన్నం
ఏండ్ల తరబడి దెబ్బలు తింటనే ఉన్నం
అసలింతకీ పిస్సోడెవలు?
ఓటనే రాయినిచ్చే ఓటరా?
గెల్సి గద్దెనెక్కి పవరనే రాయితో
కొట్టే నాయకుడా...?
ఏమో...
ఆ రాల్ల దెబ్బలకు
నాకే పిస్సలేసిందో..!?

**-గుర్రాల వేంకటేశ్వర్లు**

# ఘనంగా తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక కళారూపాల ప్రదర్శన




హైదరాబాద్, మే 13:కథక సమ్మేళనం అనే శీర్షికతో..మే 5 శుక్రవారం సాయంత్రం.. పాల్కురికి సోమన్న మూల, రవీంద్ర భారతిలో, రచయితలు తమ స్వీయకథలు వినిపించడం అనే కార్యక్రమానికి ఏనుగు నరసింహారెడ్డి రూప కల్పన చేశారు.

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా ప్రజాకళ-ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కవి సమ్మేళనాలు, పల్లె పాటలు, జానపద పాటలు, కళా రూపాలు ప్రదర్శనలు జరుగుతున్నాయి.

ముందు ముందు ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరిపించి కథకులను ప్రోత్సహించాలని కవులు రచయితలు కళాకారులు కోరుతూ ధన్యవాదాలు తెలిపారు. ఇట్లాంటప్పుడే రచయితలకు ఇతర రచయితలు ఏమి రాస్తున్నారు ఎలాంటి కథాంశాలు తీసుకుం టున్నారు అన్న విషయం పరస్ప రం తెలుసుకోవడానికి, ఒకరి నొకరు మెరుగుపరచుకోవడానికి వీలు కలుగుతుంది అన్నారు వక్తలు.

వివిధ జిల్లాలలో ఉన్న రచయితలను కలుసుకోవడానికి ఇది మంచి వేదిక అయ్యింది. ఇలాంటి కార్యక్రమాలకు మరికొంత ప్రచారం అవసరం. ఈ కథా శ్రవణం కు బి.వి.ఎన్. స్వామి అధ్యక్షత వహిం చారు. కార్యక్రమము ఆసాంతం చాలా సమర్థవంతంగా నిర్వహిం చారు. ప్రేక్షకులు కొద్దిమందే ఉన్నా, కథకులు మాత్రం ఆసక్తికరమైన కథలను సమర్థవంతంగా వినిపించారు. ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమం లో బి.యస్.రాములు , ముదుంబై పురుషోత్తం, కొట్టం రామకృష్ణా రెడ్డి, అయితా చంద్రయ్య గారు, శీలం భద్రయ్య, సాగర్ల సత్తయ్య , భూతం ముత్యాలు తాళ్ళపల్లి యాకమ్మ, బి.వి.ఎన్. స్వామి, సమ్మెట ఉమా దేవి చక్కని కథలు వినిపించారు. కథకులను సన్మానిస్తూ ఏనుగు నరసింహారెడ్డి గారు వీలు చూసుకొని ఈరోజు చదివిన కథలను ఒక సంకనంగా ప్రచురించి చరిత్రలో నిలిచి పోయేలా చేస్తాని అన్నారు. ఈ సందర్భంగా బి ఎస్ రాములు గారు కథల బడి , తెలంగాణ కథ నవల అనే రెండు పుస్తకాల ను అందరికి ఉచితంగా అందజే శారు.. రచయితలు తమ తాజా కథల సంపుటాలను పరస్పరం కానుకగా అందజేశారు. చక్కని ప్రశాంత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# కవిసంధ్య కవిత్వ శిక్షణా శిబిరం-2026

హైదరాబాద్, మే 13:తెలుగు శాఖ,డా.ఎస్.ఆర్.కె.ప్రభుత్వ కళాశాల, యానాం, కవిసంధ్య, సాహిత్య సాంస్కృతిక సంస్థ,సంయుక్త నిర్వహణ లో జూన్ 13, 14, తేదీలలో యానాం లో వర్ధమాన కవులకోసం కవిత్వ శిక్షణా శిబిరం నిర్వహిస్తోంది. ప్రముఖ కవులు,విమర్శకులు వివిధ కవిత్వ అంశాలపై ప్రసంగిస్తారు.

ఆసక్తి గల యువ కవులు తమ సంక్షిప్త బయోడేటా,ఇటీవలి తమ ఒక కవితను, మే,25 తారీఖు లోగా కన్వీనర్,దాట్ల దేవదానం రాజు,వాట్సాప్ నంబర్ :9440105987 కు పంపాలి. వచ్చిన దరఖాస్తులను కమిటీ పరిశీలించి కవులను ఎంపిక చేస్తుంది.ఎంపిక అయిన అభ్యర్థులు తమ సొంత ఖర్చులతో శిక్షణాశిబిరంలో పాల్గొనాల్సి ఉంటుంది.రెండు రోజులు స్థానిక వసతి,భోజన సౌకర్యం సంస్థ కల్పిస్తుంది.చివరి రోజు ఒక కవిత్వాంశం పై కవిత రాయించి ఎంపిక చేసిన కవితలను కవి సంధ్య పత్రిక లో ప్రచురిస్తాం.

**-డా.శిఖామణి,** అధ్యక్షులు,కవి సంధ్య

**-డా.వరుగు భాస్కర్ రెడ్డి,** ప్రిన్సిపాల్,

# 'మర్యాద'తో ఆరోగ్యకరమైన మానవ సంబంధాలు !

మర్యాదకు నిలువెత్తు రూపం భద్రాద్రి రామయ్యే. మర్యాద రాముడిగా జీవితం గడపడం ఓ అద్భుత కళ. మర్యాదను ఆంగ్లంలో 'డీసెన్సీ' అని పిలుస్తాం. డీసెంట్‌గా ప్రవర్తిస్తే మనకు సమాజంలో మర్యాద రామన్న అని పేరు వస్తుంది, పలు ప్రయోజనాలను తెచ్చి పెడుతుంది. మర్యాద అనేది ఓ నైతిక ప్రవర్తన మాత్రమే. రాముడి భక్తి, ధర్మం, కరుణల అత్యున్నత ప్రమాణాలను కలిగిన శ్రీరాముడు మర్యాద పురుషోత్తముడు అయ్యాడు. ఇతరులతో మంచిగా, దయగా ఉండడమే మర్యాద అవుతుంది. మన మాటలు, చేతలు, దయాగుణం లాంటివి మన మర్యాదను ప్రభావితం చేస్తాయి. దురుసుతనం, అసభ్యత, స్వార్థం లాంటివి అమర్యాద పేరును తెచ్చి పెడతాయి. సున్నితంగా మాట్లాడటం, ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం, తీవ్రమైన చర్యలకు పూనుకోకపోవడం, వాదనలకు దిగకుండా సుహృద్భావ వాతావరణంలో చర్చించుకోవడం మర్యాదకు పునాదులు అవుతాయి.

**జాతీయ మర్యాద (డీసెన్సీ) దినోత్సవం:**

మర్యాద అనేది సున్నితమైన వ్యక్తి ప్రత్యేక ప్రవర్తన. పెద్దలు, పిల్లలు, సహచరులతో సరిగ్గా నడుకోవలసిన విధానమే అసలైన మర్యాద. సంస్కృతంలో మర్యాద అంటే 'సరిహద్దు' అని అర్థం. సమాజంలో ప్రతి సందర్భంలో మనం ఏ మేరకు చొరవ తీసుకోవాలి, ఏం మాట్లాడాలి, ఎలా మాట్లాడాలో తెలిపే సరిహద్దులను మర్యాదగా పిలుస్తాం. హద్దులు దాటి మాట్లాడినా, చర్యకు ఉపక్రమించినా అమర్యాద అవుతుందని తెలుసుకోవాలి. ఏ విషయంలోనైనా హద్దులు దాటితే అధోగతే పడుతుందని తెలుసుకోవాలి. మర్యాద లేదా డీసెన్సీ ప్రాధాన్యాన్ని గుర్తించి అమెరికన్ మహిళ "లిసా చొల్నోకి" ప్రతి ఏట 14 మే రోజున "జాతీయ మర్యాద దినోత్సవం" లేదా "నేషనల్ డీసెన్సీ డే" పాటించుట ఆనవాయితీగా మారింది. నిస్వార్థత, సరైన రీతిలో స్పందించడం, మాటలను తూటాలుగా కాకుండా ప్రేమతో సున్నితంగా వాడడం, వాదనకు దూరంగా ఉండడం, దయ/కరుణలకు బద్దులుగా ఉండడం, నైతికంగా ప్రవర్తించడం, సహనాన్ని కలిగి ఉండడం, ఆశావహ దృక్పథంతో ప్రవర్తించడం, నిజాయితీగా ఉండడం, గౌరవాన్ని ఇచ్చి పుచ్చుకోవడం, కలుపుగోలుగా ఉండడం లాంటి లక్షణాలు మనకు మర్యాద రామయ్య పేరును మోసుకొని వస్తాయి.

**మర్యాదస్థులుగా నిలిపే సూత్రాలు:**

ఇతరులను, వారి అభిప్రాయాలను సముచితంగా గౌరవించడం అలవాటు చేసుకోవాలి. ఇతరుల అభిప్రాయాలను వ్యతిరేకించినా సున్నితంగా చెప్పగలగాలి. మాటలను అదుపులో పెట్టుకోవాలి. అనేక సందర్భాల్లో మన మాటలే మనకు శత్రువులను పెంచుతాయి, అపకీర్తిని తెచ్చి పెడతాయి. వాదన కాకుండా చర్చించడం నేర్చుకోవాలి. వాదనలతో మనుషులు హద్దు మీరి మాట్లాడడం లేదా చేయకూడని పనులు చేయడం లేదా ఇతరులను నొప్పించడా జరుగుతుందని తెలుసుకోవాలి. వాదనలు కోపాలకు దారి తీసి, కొట్లాటల వరకు తీసుకు వెళతాయి. పిల్లలు, యువతలో మర్యాద బీజాలను నాటి మహా మర్యాద వృక్షాలుగా పెంచుదాం. మర్యాదపూర్వకమైన సమాజం సుఖశాంతులతో ప్రశాంతంగా ఉంటుంది.

డిజిటల్ యుగంలో మాటలు తగ్గిపోయి, ఆన్‌లైన్ రాతలు పెరిగాయి. పిల్లలు మానవ సంబంధాల విలువలను తెలుసుకోలేక పోతున్నారు. ప్రజా సంబంధాలు, కీర్తిప్రతిష్టలు, నమ్మకం, సముచిత గౌరవాలకు పునాదిగా మన మర్యాద కలిగిన ప్రవర్తన ఉపకరిస్తుంది. ప్రతి సందర్భంలో మర్యాద గీత దాటవద్దు, అపఖ్యాతి పాలుకావద్దు. మనిషికి మాత్రమే అద్భుత వ్యక్తిత్వ శాశ్వత ఆభరణంగా నిలుస్తున్న 'మర్యాద లేదా డీసెన్సీ'ని స్వంతం చేసుకుందాం, మర్యాదరామన్న వారసులుగా పేరు తెచ్చుకుందాం

(14 మే "జాతీయ మర్యాద దినోత్సవం" సందర్భంగా).



**-మధుపాళీ**
9949700037



ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా. రావి రంగారావు 2024 జనవరి నుంచి వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. ఈ వారం కథా విజేత రాయసం గిరిజారాణి వారి కథ "తాతగారు" చదవండి.

-డా॥రావి రంగారావు
9247581825

## తాతగారు



"మీకు ఉత్తరం వచ్చింది".. గేటు తీసుకుని లోపలికి వస్తూనే ఇల్లుగల వాళ్ళమ్మాయి పరుగున వచ్చి ఉత్తరం చేతిలో పెట్టి వెళ్ళింది. "నాకు ఉత్తరమా? నిజమా?" అనుకుంటూ అడ్రస్ చూసింది కావ్య.. తనపేరే. ఫ్రం అడ్రస్ చూసింది.. తాతయ్య నుండి!!

ఆశ్చర్యం... ఆనందం.. కలగలసి.. శరీరం కంపిస్తుండగా.. నిలబడలేక అక్కడే వరండాలోని కుర్చీలో కూలబడిపోయింది. ఉత్తరం చదవాలనే విషయం కూడా మర్చిపోయి తాతయ్య దస్తూరిని చేతితో స్పృసిస్తూ... కళ్ళు మూసుకుంది.

చిన్న తనం నుండీ తాతయ్య దగ్గర చనువు ఎక్కువ. తన చేతిని పట్టుకొని అక్షరాలు దిద్దించినచేయి... సెలవు లివ్వగానే రండంటూ ఉత్తరాలు వ్రాసిన చేయి.. "నా మనవరాలు" అంటూ ఊరందరికీ చూపించిన చేయి.

పండిన గోరింటాకు చూస్తూ మంచి మొగుడొస్తాడంటూ ముద్దు చేసిన చేయి.!!

మరి.. మరి.. నేను చేసిందేమిటి.. చదువు పూర్తయి ఉద్యోగంలో చేరటం... సహోద్యోగిని ఇష్టపడటం .. కులాలు వేరవటంతో.. రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుని వెంకట్ తో కొత్త జీవితం ప్రారంభించటం!!

అమ్మానాన్నల కంటే కూడా ఎక్కువగా చూసిన తాతయ్యకైనా ఒక్క మాట చెప్పలేదే!!

వెంకట్ సాహచర్యంలో రెండు సంవత్సరాలు ఎలా గడిచాయో కూడా తెలీలేదు.

తల్లి కాబోతున్నా నని తెలిసిన క్షణం మాత్రం... ఎందుకో.. అమ్మ.. నాన్న... తాతయ్య... మా వూరు... అన్నీ గుర్తొచ్చాయి .. నా మనసు తెలిసినట్లు గా... ఇప్పుడు ఈ ఉత్తరం!!

కళ్ళనుండి రాలిన నీటి బొట్టు పెదవులకు ఉప్పగా తగలగా.. ఈ లోకం లోకి వచ్చింది కావ్య. ఉత్తరం తెరిచే ధైర్యం చేయలేక పోయింది. ఊఁహూఁ... నా వల్ల కాదు..

"ఏం టమ్మాయ్ అలాగే కూర్చున్నావు?? ఒట్టి మనిషివి కూడా కావు.. ఇంద టీ తాగు" అంటూ ఇల్లుగలామె టీ ఇచ్చి వెళ్ళింది. టీ తాగేసరికి వెంకట్ రానే వచ్చాడు. వస్తూనే.. "ఏంటి అలా వున్నావు .. ఈ ఉత్తరం ఏంటి?? ఏమైంది" అంటూ ఆదుర్దాగా అడిగే సరికి.. కట్టతెంచుకున్న ఉద్వేగం ఉప్పెనైంది. "ముందు లోపలకుపద. ఉత్తరం చదువుదాం" అంటూ వెంకట్ కావ్య ను పొదివి పట్టుకొని లోపలకు తీసుకెళ్ళాడు.

ఫ్యాన్ వేసి.. సోఫాలో కూర్చొని ఉత్తరం చదవటం ప్రారంభించాడు.

"చిరంజీవి లక్ష్మిసౌభాగ్యవతి కావ్య కు మీ తాతయ్య దీవించి వ్రాయునది.. ఉభయకుశలోపరి.

నీ అడ్రస్ ఎలా తెలిసిందా... అని ఆశ్చర్యపడకు. నీవు వెళ్ళిన హాస్పటల్ లో నాకు తెలిసిన వారు పని చేస్తున్నారు. వారి ద్వారా మీ విషయాలు తెలుసుకుంటూనే వున్నాము. మీరు అనుకుంటున్నట్లుగా నీ మీద మా కెవరికి కోపం లేదు. కేవలం మీ పెళ్ళి చూడలేదే అన్న బాధ తప్ప! పౌరాణిక కాలం నుండి కూడా వరుడిని ఎంచుకుని వరించే అధికారం స్త్రీకి ఇవ్వబడింది. అది సమంజసం కూడా! ద్రౌపది.. సీత.. దమయంతి... రుక్మిణీ.. స్వయంవర వేదికగా వరుడిని ఎంచుకున్న వారే! మీ వివాహాన్ని నేను.. మీఅమ్మా..నాన్నా.. అందరం సంపూర్ణంగా సమ్మతిస్తున్నాము.

ఈ ఉత్తరం అందిన వెంటనే మన ఇంటికి రండి. మీఇద్దరిని సంతృప్తిగా చూడాలని వుంది. అన్నట్లు.. ఈ రెండేళ్ల లో చూపు కాస్త మందగించింది.. మరేం పర్లేదులే.. మందులు వాడుతున్నాను.

మీకోసం ఎదురుచూస్తూ... అనేక ఆశీస్సులతో... మీ తాతయ్య

-బుచ్చి రామచంద్రరావు"

వెంకట్ చదవటం పూర్తి కాగానే కావ్య ఆనందానికి అవధులు లేవు.

పసిపిల్లలా సంబరపడుతున్న కావ్యను చూస్తూ... "ఐతే ప్రయాణం ఎప్పుడూ? ... రేపా.. ?ఎల్లుండా....? ఇప్పుడేనా?" రాగయుక్తంగా..కొంటెగా అన్నాడు వెంకట్.

వృద్ధాప్యం అంటే... అనుభవం.. క్షమాగుణం... పరిణతి... పెద్దరి కం. ఇల్లుగలామె కూతురు చదుకుం టోంటే... వరండాలోంచి వినబడు తోంది...

వృద్ధుడూ.. ప్రకృతీ.. పెద్దా.. వికృతీ..

**-రాయసం గిరిజా రాణి**
98499 17675

## జీవజలం చలం

సాహిత్య స్మారకోపన్యాస సభ

19.5.2026 బుధవారం సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి, కాన్ఫరెన్స్ హాలులో చలం సాహిత్య స్మారకోపన్యాస సభ జరుగుతుంది.

చలం పౌరాణిక సాహిత్యం - వస్తు రూపాలపై


ఎన్.వేణుగోపాల్, కుప్పిలి పద్మ ప్రసంగిస్తారు.

డా.ఏనుగు నరసింహారెడ్డి ఆప్తవాక్యం పలుకుతారు.

చలం పౌరాణిక నాటిక, నాటకాలలోని కొన్ని ముఖ్య భాగాలను - భండారు విజయ, జ్వలిత, అరుణ ధూళిపాల, ఐనంపూడి శ్రీలక్ష్మి, గడ్డం సులోచన వినిపిస్తారు.

ఈ సభకు మీరు తప్పక రావాలని మనవి.

- డా. నాళేశ్వరం శంకరం
కన్వీనర్, చలం భావన.



Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com